ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

సోమవారం 11 నవంబరు 2024 | 5



జీవీఆర్ చౌదరికి గజమాల వేసి సత్కరించిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి దంపతులు

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట

ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని శెట్టిబలిజ డవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు పార్టీ ఎన్నో పదవులు కట్టబెట్టిందన్నారు. పార్టీ జెండా పట్టుకుని ఎన్నికష్టాలు వచ్చినా జెండాను వీడకుండా పార్టీలు మారకుండా నిలబడిన తనను గుర్తించి ఈరోజు స్టేట్ చైర్మన్ పదవి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ విషయంలో టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నింటికి ప్రాధాన్యత ఇస్తూ శెట్టిబలిజ గౌడ, శ్రీశయన,యాత సంఘీయుల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. గత ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తే తమ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందన్నారు. లాలాచెరువు సెంటర్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని, సంఘీయుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చైర్మన్ సత్తిబాబును శెట్టిబలిజ సంఘీయులు, టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మునిని బాబూరావు ,కడలి రామకృష్ణ,కడియాల భద్రరావు దొంగ నాగమణి, పిల్లి శ్యామ్, కడియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబును సత్కరిస్తున్న నాయకులు

పుష్కరాలపై దృష్టి పెడతా

రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి

రాజానగరం/కోరుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రుడా చైర్మన్ పదవి తనకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెట్టిన భిక్షగానే స్వీకరిస్తున్నానని రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(రుడా) చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. రుడా చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం ప్రకటించిన తరువాత తొలిసారిగా ఆదివారం బీవీఆర్ స్వగ్రామమైన పెద్దాడ నుంచి కోరుకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ర్యాలీగా బయలుదేరారు.ఈ మేరకు రాజానగరంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు గజమాలలు, బాణసంచాల కాల్పులతో ఘన స్వాగతం పలికారు. తూర్పు గోనగూడెం శివాలయం,దోసకాయలపల్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.అనంతరం ఆయన కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు.అక్కడ జరుగుతున్న కార్తీక అన్న సమారాధనలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.గతేడాది కాలంగా పార్టీ కార్యకలాపాల్లో తన వెంట ఉంటూ తమలో ఒకరిగా భావించి తన వెన్నంటే ఉంటున్న కూటమి నాయకులు, కార్యకర్తలు ఆదరాభిమానాలతోనే సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నాయకుడు లోకేశ్ తనకు ఈపదవి కట్టబెట్టి నట్టుగా భావిస్తున్నానన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తాన న్నారు. రుడా చైర్మన్ పదవి ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవ రావు, గంగిశెట్టి చంటిబాబు, రొంగల శ్రీనివాస్, మార్ని రాము, మార్ని వీరాంజనేయులు, ధారా రాంబాబు, దోసకాయలపల్లి సర్పంచ్ ధారా యశోదమ్మ, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గంగిశెట్టి చంటి బాబు, కంటే కేశవరావు, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, తెలుగు యు వత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, నాయకులు నీలపాల అరవరాజు, బత్తుల త్రిమూర్తులు, నూనె వెంకన్న, మద్దిరెడ్డి చిన వెంకటేశ్వరరావు, పెద్దిశెట్టి నారాయణస్వామి, నాతిపాం జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ 6



చిన్నారి సిద్ధార్థను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్
మాట్లాడుతున్న స్వామిజీ

ముగిసిన భక్తసమ్మేళనం

నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస సందేశాన్ని ప్రపంచమంతా చాటుతున్నట్టుగా ముందుగానే శారదాదేవి స్వప్నంలోనే చూశారని స్వామి సేవానంద మహరాజ్ అన్నారు.నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామకృష్ణ వివేకానంద ఐదో భక్త సమ్మేళనం ముగింపోత్సవం లో ఆయన మాట్లాడారు.దేశంలో రెండు వందలకుపైగా శ్రీరామకృష్ణ మఠాలు రావడానికి శారదాదేవి ప్రార్థనే కారణమన్నారు. భక్తిశ్రద్ధలుంటే మనం సాధన చేసుకునేందుకు సమయం ఉంటుందన్నారు.

చిన్నారి సిద్ధార్థకు అభినందన

ప్రియమైన సోదరులారా భారతదేశపు నేల నా మహోన్నతస్వర్గం భారతదేశపు ప్రతి ధూళికణం నాకెంతో పవిత్రమైనది అంటూ 4వ తరగతి విద్యార్థి తుట్టగుంట సిద్ధార్థ స్వామి వివేకానంద ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. సిద్ధార్థ వివేకానంద ఏకపాత్రాభినయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు, మంత్రి కందుల దుర్గేష్ అభినందలతో ముంచెత్తారు. వివేకానందుడి బోధనలు యువత భవిష్యత్తుకు మార్గదర్శకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్వామీజీలు, మాతాజీలు,మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మందేదీ!

డిమాండ్ హై..సరఫరా లో..

- షాపుల్లో మందు కొరత
- బ్రాండ్లు అందక ఇబ్బంది
- అవసరత 5 వేల కేసులు
- దిగుమతి 2 వేల కేసులు
- రేషన్ విధానంలో పంపిణీ
- చాలా దుకాణాల్లో నిల్వలు
- వ్యాపారుల మతలబు
- మందుబాబుల అవస్థలు
- అధికారుల తనిఖీల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కొత్త మద్యం పాలసీ.. ప్రైవేటు షాపులు అందుబాటులోకి వచ్చాక మందు బాబులు పండగ చేసుకుంటున్నారు.నాణ్యమైన సరుకు గొంతులోకి దిగుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొత్త పాలసీ ప్రారంభమైన మూడు వారాలకే బ్రాండ్ల కొరత రావడంతో నొచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ పిచ్చి బ్రాండ్లకు స్వస్తి పలికిన విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే మద్యం దుకాణాలకు బ్రాండ్లు వస్తున్నాయి. రోజుకు ఎంత సరఫరా చెయ్యాలో ఇంకా ఓ అంచనాకు రాకపోవడంతో కొరత వస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ హయాంలోని రంగుసారా స్టాకు 2వేల కేసులు ఉంది. దానిని వదిలించుకొనే ఉద్దేశంతో కొరత సృష్టిస్తున్నారా? అనే అనుమానాలున్నాయి. ఏదేమైనా మందుబాబులు ఆనందపడే లోపుగానే కొరత రావడంతో ఇబ్బంది పడుతున్నారు.

రేషన్ విధానం


గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విచ్చలవిడిగా నాసిరకం మద్యాన్ని ఏరులై పారించారు. దీంతో ఐదేళ్ల పాటు నాసిరకం మద్యాన్ని మందుబాబులు గొంతులో పోసుకోక తప్పలేదు. ఎన్నికల హామీలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఎంసీ, సియాగ్రమ్స్ వంటి అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్ల సరఫరా మొదలైంది. ఇప్పుడు కొత్త చిక్కు వచ్చి పడింది. వ్యాపారస్తుల ఇండెంట్ ప్రకారం ఆయా కంపెనీలు సరఫరా చేయలేకపోతున్నాయి. వైసీపీ హయాంలోని ప్రభుత్వ దుకాణాల వల్ల కేవలం వాళ్ల బ్రాండ్లనే మార్కెట్ చేశారు. ఇప్పుడు ప్రైవేటు దుకాణాలు కావడంతో వ్యాపారస్తులు తమకు ఎక్కువగా విక్రయాలు జరిగే బ్రాండ్లకు ఆర్డర్ చేస్తున్నారు. పైగా ప్రైవేటు దుకాణాలకు ఎంత కావాలంటే అంత సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో వీళ్లు ఎక్కువ మొత్తంలో నిల్వ చేస్తున్నారు. ఈ కారణంగా కూడా కొరత ఏర్పడుతోంది. రేషన్ విధానంలో డిపోల నుంచి పంపిణీ చేస్తున్నారు.దీంతో గత ప్రభుత్వంలో సరఫరా చేయబడి నిల్వ ఉన్న బూమ్,బీరా వంటి వాటిని క్రమంగా వదిలించుకుంటున్నారు.షాపుల్లో మళ్లీ అవి కనబడుతుండడంతో మందుబాబుల్లో అసహనం కనబడుతోంది.కొత్త మద్యం పాలసీ షోకు అప్పుడే అయిపోయిందా అంటూ పెదవి విరుస్తున్నారు.

ఆదివారం టెన్షన్

వైసీపీ ప్రభుత్వంలో రూ.150 వెచ్చించినా నాసిరకమైన రంగు సారా తాగాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రూ.99కే నాణ్యమైన చీప్ లిక్కర్ తేవడంతో దానికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. రోజుకు రెండు మూడు లోడ్లు వచ్చినా సరిపడని పరిస్థితి ఉంది. ఇప్పుడు రోజుకు ఒక లారీ మాత్రమే వస్తోంది. లారీ సైజును బట్టి 1000 నుంచి 1600 కేసులు వస్తున్నాయి. దీంతో పంపిణీపై అధికారులు తల పట్టుకుంటున్నారు.రాజమహేంద్రవరం ఏపీఎస్‌బీసీఎల్ డిపో పరిధిలో మద్యం దుకాణాలు, బార్లు కలిపి 150 వరకూ ఉన్నాయి. లారీ లోడు వచ్చిన వెంటనే దుకాణానికి సరాసరిన 8 కేసుల లెక్కన ఇస్తుంటే ఉఫ్‌మని అయిపోతున్నాయి. మళ్లీ లోడు వచ్చే వరకూ ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది.ఎంసీ, ఐబీ, నాకవుట్, కేఎఫ్ వంటి ఎక్కువగా విక్రయాలు జరిగే ఓ ఏడెనిమిది బ్రాండ్ల సరఫరా కూడా తగ్గింది. రోజుకు 5 వేల కేసుల అవసరత ఉంటే 2 వేల కేసుల వరకూ మాత్రమే వస్తున్నాయి. ఆదివారం డిపోలకు సెలవు కావడంతో దుకాణదారులు శని, ఆదివారాలకు కలిపి శనివారం కొనుగోలు చేస్తారు. దీంతో శనివారం పంపకాలు చేయడానికి అధికారులకు ఇబ్బంది తప్పలేదు. ఆదివారం అమ్మకాలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారస్తులు అందరూ ఆ రోజుపై ఫోకస్ చేస్తుంటారు. ప్రస్తుతానికి రాజమహేంద్రవరం డిపో నుంచి రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకూ సరుకు వెళుతోంది. అయితే దీనిలో చాలా మటుకు వ్యాపారస్తులు నిల్వ చేస్తున్నారు.అటు సరఫరా తగ్గడం, ఇటు వ్యాపారస్తులు ఇబ్బడిముబ్బడిగా సరుకు నిల్వ చేసుకోవడంతో.. జనాదరణ కలిగిన బ్రాండ్లు కొన్ని షాపుల్లోనే అందుబాటులో ఉంటే అనధికారికంగా ధర పెంచేస్తారని మందు బాబులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా చేస్తున్నట్టు సమాచారం.

డీఎస్సీ ఎప్పుడో!

- డీఎస్సీ నోటిఫికేషన్‌కు జాప్యం..
- నిరాశలో నిరుద్యోగులు
- 4న విడుదలైన టెట్ ఫలితాలు..
- 6న డీఎస్సీ ప్రకటన వస్తుందని ఆశ
- అమల్లోకి ఎమ్మెల్సీ కోడ్..
- సాంకేతిక కారణాలతో ఆలస్యం
- ఉమ్మడి జిల్లాలో 1346 ఖాళీలు
- తప్పని ఎదురుచూపులు



కాకినాడ రూరల్,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది. ఆ ఐదేళ్లూ అభ్యర్థులకు ఎదురుచూపులే మిగిలాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది.రాష్ట్రవ్యాప్తంగా 16,347కుపైగా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించింది. ఈ ఫలితాలు 4న విడుదల కావడంతో 6న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని భావించారు. ఇప్పటికే చాలా మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుతో పాటు అభ్యర్థుల వయస్సు పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున కొన్ని అనివార్య కారణాలతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. కానీ ఆ సమస్యలన్నింటినీ సరిచేసి కోడ్ ముగిసిన తర్వాత మరికొద్దిరోజుల్లో నోటిఫికేషన్ వెలువరిస్తారని అధికారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో తమకు మళ్లీ ఎదురుచూపులు తప్పడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1346 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 94, తెలుగు 78, హిందీ 77, గణితం 60, ఫిజికల్ సైన్స్ 69, బయాలాజికల్ సైన్స్ 99, సోషల్ స్టడీస్ 130, ఫిజికల్ ఎడ్యుకేషన్ 201, ఎస్జీటీలు 365, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు అన్నీ కలిపి డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నట్టు తెలిసింది.వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.నోటిఫికేషన్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 90 వేల మంది కిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఇప్పుడంతా డిజిటల్! 6
మారిన విద్యా విధానం



మామూళ్లు.. మామూలే!

- ఆగని ఇసుక దోపిడీ
- దళారుల ఇష్టారాజ్యం
- తీపర్రులో అదనపు వసూళ్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు.. తనిఖీ
- నోరుమెదపని వాహనదారులు


పెరవలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇసుక దోపిడీ కొనసాగుతూనే ఉంది.. ప్రత్యక్షంగా పరోక్షంగా భవన యజమానుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. అయినా అడ్డుకట్ట వేసేవారే కానరావడంలేదు. కలెక్టర్ ఎన్ని హెచ్చరికలు చేసినా రీచ్‌ల వద్ద మామూళ్లు మామూలుగానే సాగుతున్నాయి..ఇప్పటికీ మీకెంత.. మాకెంత అన్నట్టుగా ఇసుక రవాణా సాగుతున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇసుకపై రూపాయి వద్దన్నా.. దళారీలు మాత్రం వదలడంలేదు. ఏదో ఒక విధంగా దోపిడీకి తెగబడుతూనే ఉన్నారు. శనివారం కలెక్టర్ ప్రశాంతికి ఎదురైన సంఘటనే అందుకు ఉదాహరణ. తీపర్రు ఇసుక ర్యాంప్‌లో లారీల వద్ద నుంచి వసూలు చేయాల్సిన దాని కంటే ఎక్కువ వసూలు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు అందింది. దీంతో శనివారం ఆమె హుటాహుటిన తీపర్రు ర్యాంప్‌కు వచ్చారు. అయితే అక్కడ ర్యాంప్‌లో వాహనదారులు ఆమె వద్దకు వెళ్లి తమ వద్ద ఎక్కువ వసూలు చేసినట్టు చెప్పకపోవడం విశేషం. దీంతో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదు అందిం దని చెప్పగా నిర్ణయించిన ధర మాత్రమే వసూ లు చేస్తున్నామని సమాధానం ఇచ్చారు.దీంతో నిర్ణయించిన ధరకంటే ఎక్కువ సొమ్ము వసూ లు చేస్తేచర్యలుతప్పవని హెచ్చరించి వెళ్లిపోయారు.

తీపర్రులో అదనంగా వసూళ్లు?

పెరవలి మండలం తీపర్రు ర్యాంపునకు పాలకొల్లు, భీమవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన లారీల నుంచి ఒక్కొక్క లారీకి రూ.2 వేలు చొప్పున వసూలు చేయాల్సి ఉండగా రూ.5 వేల నుంచి రూ.6 వేలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.గోదావరిలో ఇసుకను కూలీలతో ఎగుమతి చేయించి ట్రాక్టర్లపై తెచ్చి దిగుమతి చేయించి జేసీబీలతో లారీలపై ఎగుమతి చేస్తున్నారు.దీంతో కాంట్రాక్టరుకు గిట్టుబాటు కావడం లేదు.ఈ నేపథ్యంలో కొంత ఎక్కువ వసూలు చేయాల్సి వస్తుందని కొంత మంది చెబుతున్నారు.అయినప్పటికీ నిర్ణయించిన ధర ప్రకారం వసూలు చేయాలని అదనంగా వసూలు చేస్తే సహించేది లేదని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు.ఈ మేరకు తహశీల్దార్ అచ్యుత కుమారి శనివారం సాయంత్రం వరకు అక్కడే ఉండి లారీలు వద్ద అదనపు సొమ్ము వసూలు చేయకుండా నిర్ణయించిన ధర మాత్ర మే వసూలు చేసి ఎగుమతి అయ్యేలా చూశారు.



10 టన్నులు..రూ.960.20



ఒక టన్ను ఇసుకకు రూ.96.2, 4 టన్నులకు రూ.384.8 పైసలు, పది టన్నులకు రూ.960.20 పైసలు, 20 టన్నులకు 19.25పైసలు వసూలు చేయాలని బోర్డు ఏర్పాటు చేశారు. అదనం గా డబ్బులు వసూలు చేస్తే తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ర్యాంప్‌లో అం దరికీ కనపడే విధంగా బ్యానర్లు పెట్టారు. దీంతో లారీ యజమానులు, డ్రైవర్లు ఆనందంవ్యక్తం చేస్తున్నారు.ఆదివారం ప్రభుత్వ సిబ్బందికి సెలవు కావడంతో ఎగుమతి కాలేదు.సోమవారం లారీల నుంచి ఏ విధంగా సొమ్ములు వసూలు చేస్తారనేది చూడాలి.

ఇసుక అక్రమాలకు పాల్పడితే నాకు ఫిర్యాదు చేయండి : మంత్రి



నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు జరగాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు అత్యాశపరులు ఉచిత ఇసుక పథకాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ఇసుక విక్రయాలు సాగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగానే ఉచిత ఇసుక పథకం అమలు జరిగి తీరాలన్నారు. అత్యాశపరులు ఎవరైనా ఇసుక విక్రయాల్లో ఎవరి పేరు ఉపయోగించినా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుకకు ధర లేదని.. రవాణాకు మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పోలీసు రెవెన్యూ అధికార్ల దృష్టికి తీసుకెళ్లాలని..లేదా నాకు ఫిర్యాదు చేసినా స్పందిస్తానన్నారు.

ఇసుక కొరత రానీయవద్దు : జేసీ

రాజమహేంద్రవరం,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):బోట్స్‌మన్ సొసైటీల సభ్యులంతా ఇసుక కొరత రాకుండా చూసుకోవాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం 90 బోట్స్‌మన్ సొసైటీల సభ్యులతో ఇసుక సరఫరాపై సమీక్షించారు. నిర్మాణ పనులకు అంతరాయంలేకుండా ఇసుకను అందించాలన్నారు.బోట్స్‌మన్ సొసైటీలకు చెల్లించాల్సిన ఇసుకతీత డబ్బు ఆయా సొసైటీ బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ప్రతి రీచ్‌లో రోజుకు 1000 నుంచి 2000 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లడానికి ఓపెన్ రీచ్‌లలో ఉచిత ఇసుక సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.ప్రభుత్వానికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు.సమావేశంలో జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్‌రెడ్డి,ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత పాల్గొన్నారు.





నగరపాలక సంస్థలో ట్రైనీ ఐఏఎస్‌లకు వివరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

జీజీహెచ్‌లో ఓపీ తీరు తెలుసుకుంటున్న ట్రైనీ ఐఏఎస్‌లు

ట్రైనీ ఐఏఎస్‌ల పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫీల్డ్‌స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం (ఎఫ్ఎస్ఆర్‌పీ) 99వ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు 11 మంది ఆదివారం రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులకు, గర్భిణులు తదితరులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ల్యాబ్‌ను సందర్శించి అక్కడ నిర్వహించే పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. ఫార్మసీలో మందుల స్టాకు వివరాలు, గడువు దాటిన మందుల విషయంలో తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న అర్బన్ హెల్త్ సెంటర్లలో అందిస్తున్న వైద్యసేవల గురించి ట్రైనీ ఐఏఎస్‌లకు వివరించారు. ముందుగా, ఓపీ వివరాల నమోదు చేసి వాటిని ఆన్‌లైన్‌లో ఉంచుతామని, అనంతరం అవసరమైన వైద్యసేవలందిస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌ను సందర్శించారు. నగరపాలక సంస్థ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై కమిషనర్ కేతన్ గార్గ్ అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. ఈట్ రైట్ క్యాంపైన్ ద్వారా చేపట్టిన ఆహార విక్రయకేంద్రాల తనిఖీలు, శానిటేషన్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల వివరాలు, నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను ఈ బృందం సందర్శించారు. అనంతరం ఇన్నీసుపేటలోని పీహెచ్‌సీని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ హరిబాబు, డాక్టర్ షమ్మీకుమార్, ఎపిడమాలజిస్ట్ సుధీర్, అర్బన్ హెల్త్ విజిటర్ విజయకుమారి,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ కోటయ్య పాల్గొన్నారు.

ఒక టేబుల్.. దానికి చేర్చి ఒక కుర్చీ..ఆ కుర్చీలో మాస్టారు.. ఆ వెనుకే బ్లాక్ బోర్డు.. దాని ముందు విద్యార్థులు ఇదీ ఒక నాడు తరగతి గది అంటే.. మరి నేడు.. కాలంలో ఎంత వేగంగా మార్పు వచ్చిందో.. విద్యా విధానంలో కూడా అంతే వేగంగా మార్పులు వచ్చాయి.. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు లేవు.. చాక్‌పీస్‌లు లేవు.. అంతా మారిపోయింది.. ఇప్పుడంతా డిజిటల్ యుగమే.. ఇప్పుడు తరగతిలోకి వెళ్లామంటే.. ఒక చిన్న ప్రొజెక్టర్.. దానికి ఎదురుగా బోర్డులాంటి ఒక తెర.. ప్రొజెక్టర్ ఆన్ చేస్తే చాలు పాఠాలు వస్తాయి.. ఇంటర్నెట్ సహాయంతో మాస్టార్లు చెబుతుంటే ఎన్నో కొత్త కొత్త విషయాలను విద్యార్థులు కూలంకషంగా నేర్చుకుంటున్నారు.. డిజిటల్ చదువులు అభ్యసిస్తున్నారు.. కాలంతో పాటు వేగంగా పరుగులు పెడుతున్నారు.. నేడు జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మారిన విద్యా విధానంపై ప్రత్యేక కథనం.

ఇప్పుడంతా.. డిజిటల్!



మన మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ అజాద్





చదువులో డిజిటల్ విప్లవం

రాజమహేంద్రవరం అర్బన్/తొండంగి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు టీచర్లు బ్లాక్ బోర్డుపై పాఠాలను చెప్పేవారు. టెక్స్ట్ బుక్కులోని పాఠాన్ని అంశాలవారీగా తెల్లని చాక్‌పీసుతో నల్లని బోర్డుపై రాస్తూ విద్యార్థులకు వివరించేవారు. ఇదంతా ఒకప్పటి మాట. కాలం మారింది. తరగతి గదుల్లో బ్లాక్‌బోర్డు చదువులకు కాలం చెల్లింది. మారిన కాలానికి అనుగుణంగా విద్యాబోధనలోను సమూల మార్పులు వచ్చాయి.సంప్రదాయ విద్యాబోధనకు స్వస్తిపలికి, డిజిటల్ విప్లవం వైపు బోధనా విధానం ముందుకెళుతోంది. నేడు మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి ని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పాఠశాలల్లో విద్యా విధానంపై ప్రత్యేక కథనం..

సంపద కంటే విద్య గొప్పది

నేడు జాతీయ విద్యా దినోత్సవం

కాకినాడ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మనదేశంలో విద్య అభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి మౌలానా అబుల్ కలాం అజాద్. ఆయన భారతదేశ మొదటి విద్యా శాఖా మంత్రిగా పనిచేశారు. నవంబరు 11న ప్రతి ఏటా ఆయన జయంతి సందర్భంగా మనదేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.భారతదేశం స్వాతంత్ర్యం పొందిన వెంటనే దేశంలోని పాఠశాల విద్యావిధానంలో మరో పెద్ద మార్పు కనిపించింది.కొత్తగా ఏర్పాటైన రిపబ్లిక్ ఆఫ్ ఇండియా 6 నుంచి 14 ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ ఉచిత పాఠశాల విద్య అందించాలనే లక్ష్యంతో ఉంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 45లో నిర్దేశిక విధానంగా ఉన్న వాస్తవం నుంచి చూడవచ్చు.

బోధనా పద్ధతులు రెండు రకాలు

1.ఉపాధ్యాయ కేంద్రీకృత ఉపగమం
మొదటి దానిలో ఉపన్యాస పద్ధతి, ప్రదర్శనా పద్ధతి ఉంటాయి.
2.విద్యార్థి కేంద్రీకృత ఉపగమం.
రెండో దానిలో క్రీడా పద్ధతులు, డాల్టన్ పద్ధతి, ప్రాజెక్టు పద్ధతి. విద్యార్థి కేంద్రీకృత ఉపగమంలో శాస్త్రీయ పద్ధతి, ఆగమన, నిగమన, సంశ్లేషణ, విశ్లేషణ, ప్రయోగశాల, సమస్యా పరిష్కార, అన్వేషణ పద్ధతులున్నాయి.

సమయం ఆదా

గతంలో ఒక అంశాన్ని వివరించేందుకు ఉపాధ్యాయులు తయారు చేసుకున్న బోధనోపకరణాలు, పాఠశాలలో చిరిగిన మేప్, విరిగిన గ్లోబు మాత్రమే అందుబాటులో ఉండేవి. వీటి ద్వారా అంత స్పష్టత, కచ్చితత్వం లేకపోవడం వల్ల ఒకపట్టాన అర్థం కాక సామాన్య విద్యార్థులు అవస్థలు పడేవారు. నేడు అదే అంశానికి సంబంధించిన దృశ్యాన్ని ప్రదర్శించడంతో సులభంగా అర్థం చేసుకునే వీలు కలుగుతోంది. దీనివల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సమయం ఆదా అవుతోంది. ఇతర ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఆసక్తి కలిగించే విధంగా భిన్నమైన రీతిలో బోధన సాగించినా దాన్ని ఐఎఫ్‌పీల ద్వారా నెట్ వినియోగించి వారితో ముఖాముఖి పాల్గొనే అవకాశం విద్యార్థులకు కలుగుతోంది. ప్రపంచీకరణకు అనుగుణంగా విద్యార్థి విశ్వమానవుడిగా రూపుదిద్దుకోవడానికి విద్యావ్యవస్థలో డిజిటలైజేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

విద్యా విధానంలో మార్పులను స్వాగతిస్తాం..

మార్పులు ఏం వచ్చినా స్వాగతిస్తాం. విద్యారంగానికి ఉపయోగకరంగా ఉండాలి.. మారుతున్న కాలంతో విద్యా విధానం లోనూ మార్పులు వచ్చాయి. టీచర్లు ఆ పద్ధతిని అనుసరిస్తున్నారు. చాలా పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధనకు మెరుగులద్దారు. విద్యార్థి మైండ్ సెట్‌కు అనుగుణంగా బోధన జరిగితేనే ప్రయోజనం కలుగుతుంది. ఉపాధ్యాయుడు స్వేచ్ఛగా బోధించే పరిస్థితి తరగతి గదిలో ఉండాలి.బోధనేతర పనులు అనేకం టీచర్లకు అప్పగిస్తూ బోధన జరిగిపోవాలంటే సాధ్యం కాదు. తరగతిలో విద్యార్థికి అనుకూలమైన వాతావరణం ఉండాలి. టీచర్లు సంసిద్ధం చేయాలి.

-ఎ.షరీఫ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

- సరికొత్తగా విద్యావిధానం
- బ్లాక్‌బోర్డుల్లేవ్.. చాక్‌పీసుల్లేవ్
- ప్రస్తుతం ఐఎఫ్‌పీల పాఠాలు
- మారిన విద్యాబోధన
- పరిమితంగా గ్రీన్‌బోర్డుల విధానం
- నాడు బోర్డుపై బొమ్మలకే పరిమితం
- నేడు అన్నీ కళ్ల ముందు ప్రత్యక్షం
- చూస్తున్నారు..నేర్చుకుంటున్నారు
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి
- సమయం ఆదా,అంశాలపై స్పష్టత
- కాలంతో మారుతున్న చదువు
- స్మార్ట్‌గా తరగతి గదులు

ఏమిటీ ఐఎఫ్‌పీ పానల్స్..


పాఠశాలల్లో బ్లాక్‌బోర్డు స్థానంలో ఆడియో, వీడియో, టీవీల్లో బోధన జరిగేది. ఇప్పుడు మరింత అడ్వాన్సు టెక్నాలజీ తరగతి గదుల్లోకి ప్రవేశించింది. ఒకప్పుడు కన్నాలు పడిన నల్లబల్లపై పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు, నేడు తరగతిలో ఐఎఫ్‌పీల ద్వారా దృశ్య, శ్రవణ మాధ్యమంలో అంశాలు నేర్చుకుంటున్నారు. గ్రీన్‌బోర్డు, ఫ్లాట్ పానల్స్, ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్) విధానంతో స్మార్టు టీవీలు రావడంతో తరగతి గదుల్లో బోధనలో తీరుతెన్నులే మారిపోతున్నాయి. సోషల్ మీడియాలో ఉండే ఫీచర్లన్నీ ఇందులో ఉంటాయి.ఈ విధానంలో ఉపాధ్యాయుడు డైరెక్టుగా ఇంటర్నెట్ నుంచి మరింత కంటెంట్‌ను తీసుకొచ్చి పిల్లలకు విపులంగా బోధించే వెసులుబాటు ఉంటుంది. ఈ విధానంలో ఉపాధ్యాయుడు టెక్స్ట్‌బుక్‌లోని కంటెంట్‌కు అదనంగా విస్తృతమైన సమాచారాన్ని విద్యార్థికి అందించే వీలుంటుంది. ఐఎఫ్‌పీ ఫ్లాట్ పానల్స్ విధానంలో వాట్సాప్, గూగుల్‌తోపాటు యూట్యూబ్ కూడా ఉంటుంది.రాష్ట్రంలో దాదాపు అన్ని హైస్కూళ్లలో ఈ ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఎలిమెంటరీ స్కూళ్లలో అక్కడక్కడా తప్ప చాక్‌పీసు, బ్లాక్‌బోర్డు విద్యాబోధన లేదు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ రాకతో బోధన రూపురేఖలే మారిపోయాయి. ఈ విధానంలో బోధన పిల్లలకు మరింత అడ్వాంటేజ్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఐఎఫ్‌టీ కంటే ముందు గ్రీన్‌బోర్డులు, ఫ్లాట్‌ఛానల్స్ అందుబాటులోకి వచ్చినా వాటి ద్వారా బోధన పరిమితుల పరిధిలోనే జరిగేది. గ్రీన్‌బోర్డు ఒక్కోసారి ఫ్లాట్‌పానల్‌గాను, స్క్రీన్‌గాను ఉపయోగించేకునే వీలుంటుంది. ఐఎఫ్‌పీ పానల్స్‌తో బోధన అడ్వాన్స్‌గా మారింది.

ఇసుక పలక నుంచి.. ఈ-పలక



చింతూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాలం మారుతోంది. మారుతున్న కాలానుగుణంగా జీవన విధానాలు మారుతున్నాయి. ఇసుక పలక నుంచి ఈ-పలక వరకు మార్పులొచ్చాయి. పూర్వం ఇసుకను పాఠశాల ప్రాంగణంలో నేలపై చతురస్రాకా రంగా పరిచి దానిపై అక్షరాలను దిద్దించేవా రని పెద్దలు చెబుతుండేవారు.కాలక్రమంలో చెక్క ఫ్రేంతో కూడిన రాతి పలకలు, బలపాలు వచ్చాయి.ఇంటర్నెట్ అందుబాటులో ఉన్న పల్లెల్లో సైతం డిజిటల్ బోధన జరుగు తోంది.కాసింత ఆర్థిక స్తోమత కలిగి ఉన్న ఇళ్లల్లో ఈ-పలకలు పిల్లల చేతిలో కనిపిస్తు న్నాయి. విద్యార్థులకు తేలిగ్గా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధనా విధానాన్ని అనుసరిస్తున్నారు.మన్యంలో ఆదివాసీ చిన్నారులకు అర్థమయ్యే రీతిలో ప్రభుత్వం కోయభారతి పేరిట పాఠ్యపుస్తకాలు ముద్రించి బోధన చేపట్టింది.ఈ ఏడాది చింతూరు డివిజన్‌లో 15 పాఠశాలల్లో ఈ తరహా బోధన సాగుతోంది.ప్రభుత్వం ఆదివాసీ యువతనే ఉపాధ్యాయులుగా నియమించి వారికి నెలకు రూ.5 వేలు వంతున గౌరవ వేతనం చెల్లిస్తోంది.ఈ క్రమంలో ఒకటి నుంచి మూడో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కోయ భారతిని బోధిస్తున్నారు.రానున్న కాలంలో పాఠశాలల సంఖ్య మరింతగా పెరగనుంది. తెలంగాణలో ఈ ఏడాది ఈ తరహా బోధనకు 219 పాఠశాలలు ఎంపిక చేశారు.

సబ్బుబిళ్లపై అబుల్ కలామ్ అజాద్



సబ్బు బిళ్లపై చెక్కిన అబుల్ కలామ్ అజాద్ చిత్రంతో గోవిందరాజులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోప్ కార్వింగ్ ద్వారా సబ్బు బిళ్లపై డాక్టర్ మౌలానా అబుల్‌కలామ్ అజాద్ చిత్రాన్ని చెక్కి చిత్రించారు గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిల్లి గోవిందరాజులు. జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని అజాద్ చిత్రాన్ని చెక్కినట్లు గోవిందరాజులు తెలిపారు.విద్యార్థులకు అజాద్ గురించి,విద్యామంత్రిగా ఆయన చేసిన సేవలు గురించి వివరిస్తానని చెప్పారు.

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు..

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు..
- కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్
- అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి
- నేడు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్న కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుంది. కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో ఈ మేరకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కలెక్టరేట్ ప్రాంగణంలోకి మూడు కార్లకు అనుమతి ఇస్తారు. కోర్టు హాలులో నామినేషన్ సమర్పించేందుకు అభ్యర్థితోపాటు ఐదుగురికి మాత్రమే అనుమతి ఇస్తారు. అభ్యర్థులకు ఉండే సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు. సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేస్తారు. నామినేషన్ల పరిశీలనకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియ మించారు. ఈనెల 18వ తేదీ వరకు నామి నేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈనెల 21న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుంది. డిసెంబరు 5న పోలింగ్, డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

మొత్తం ఓటర్లు 16,316 మంది

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 16,316 మంది ఉన్నారు. మొత్తంగా 116 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.

ఆరు జిల్లాల నుంచి కాకినాడకే కావాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆరు జిల్లాల నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు రావాలి. దీనిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఉన్నాయి.

ఎమ్మెల్సీ మృతి చెందడంతో ఉప ఎన్నిక

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికైన పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ గతేడాది డిసెంబరు 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఈ ఉపఎన్నిక జరుగుతుంది. 2021లో జరిగిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా షేక్ సాబ్జీ ఎన్నికయ్యారు. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027, మార్చి 29వతేదీ వరకు ఉంది. రోడ్డుప్రమాదంలో మృతి చెందడం వల్ల ఉపఎన్నిక అనివార్యమైంది.

సత్యదేవుడి గిరిప్రదక్షిణలో మార్పులు

- వేర్వేరుగా స్వామి, అమ్మవార్లు.. సత్యరథం ప్రదక్షిణలు
- 15న ఉదయం 8 గంటలకు స్వామి, అమ్మవార్లు.. మధ్యాహ్నం 2.30గంటలకు సత్యరథం
- గతంలో రెండూ ఒకేసారి • భక్తుల సత్యరథం కూడా గిరియాత్రకు ప్రచారం
- ఉదయం పాల్గొనేందుకే భక్తుల ఆసక్తి • ఎండవేడి, పౌర్ణమి ఉపవాసాలతో ఇబ్బంది
- 1.50 లక్షల మంది విచ్చేస్తారని అంచనా • భక్తుల కోసం 15 స్టాల్స్

అన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువుదీరిన రత్న, సత్యగిరిల ప్రదక్షిణకు స్వామి సిద్ధమవుతున్నాడు. ప్రతిఏటా కార్తీకపౌర్ణమినాడు లక్షలాది మంది భక్తులతో సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవార్లు పల్లకిలో ముందుకెళ్తుండగా మధ్యలో సత్యరథంతో భక్తులు సత్య, రత్నగిరుల చుట్టూ ప్రదక్షిణ చేసేందుకు పోటీ పడేవారు. ఈనెల 15న కార్తీకపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఈ ఏడాది అధికారులు తీసుకున్న నిర్ణయంతో భక్తుల్లో సందిగ్ధం, అయోమయం నెలకొన్నాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం ఉదయం 8 గంటలకు పల్లకిలో స్వామి, అమ్మవార్లు, పండితులు తొలిపావంచా వద్ద బయలుదేరుతుండగా మధ్యాహ్నం 2.30 గంటలకు సత్యరథం బయలుదేరుతుందని, గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులు సత్యరథం కూడా మధ్యాహ్నం పాల్గొనాలని దేవస్థానం ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించింది. భక్తులు మాత్రం అధికసంఖ్యలో ఉదయం స్వామి, అమ్మవార్ల పల్లకి వెంబడి గిరి ప్రదక్షిణ చేసేందుకు మాత్రమే ఆసక్తి చూపుతున్నారు. కార్తీక పౌర్ణమికి ఆడ, మగ తారతమ్యం లేకుండా అధిక సంఖ్యలో భక్తులు ఉపవాసాలు ఉండడం, మండుటెండలో ఉపవాసంతో కాళ్లకి చెప్పులు లేకుండా 5 గంటలు నడవాల్సి రావడం ఒక కారణం కాగా పౌర్ణమి పూజల సాయంత్రం తమ ఇళ్ల వద్ద పూజలు చేపట్టాల్సి ఉండడం మరో కారణంగా చెబుతున్నారు. దేవస్థానం అధికారులు మాత్రం ఉదయం, మధ్యాహ్నం భక్తులు పాల్గొన్నవారికి సంబంధించి సౌకర్యాలను ఉదయం నుంచే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 15 స్టాల్స్ ద్వారా దాతల సహకారం, దేవస్థానం నిధులతో మంచినీరు, మజ్జిగ, పండ్లు పంపిణీ చేపడుతున్నట్లు పీఆర్వో విభాగ అధికారులు పేర్కొన్నారు.

మార్పునకు కారణమిదే..

కార్తీకపౌర్ణమి సందర్భంగా చేపట్టే గిరిప్రదక్షిణలో భక్తులు పాల్గొనే సమయం మధ్యాహ్నానికి మార్చడానికి ప్రధాన కారణం స్వామిదర్శనానికి విచ్చేసే భక్తులతోపాటు గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులతో కొండపై ఆలయమంతా నిండిపోయి పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని భావిస్తున్నారు. స్వామిదర్శనాలు, వ్రతాల కోసం పౌర్ణమి ముందు రోజు రాత్రికే లక్షలాది మంది రావడం, మరుసటిరోజు గిరిప్రదక్షిణ భక్తులతో కిక్కిరిసిపోవడంతో జాగ్రత్తల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఒకానొక దశలో పశ్చిమ రాజగోపురం తలుపులు మూసివేయాల్సి రావడం, మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి సామాన్యులు ఇబ్బందిపడడంతో ఈ నిర్ణ యం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. స్వామివారి గిరిప్రదక్షిణ తేదీని కార్తీకపౌర్ణమి కాకుండా మరో తిథిని సూచించాలని ముందు అనుకున్నా దేవస్థానం పండితులు ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని మార్చకూడదని తెలపడంతో గిరిప్రదక్షిణ తిథి మార్పుపై వెనకడుగు వేశారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజన సమూహం (ఫైల్‌ఫొటో)

భక్తులకు ఇబ్బంది కలగకూడదనే ఈ నిర్ణయం

ఈవో రామచంద్రమోహన్



అన్నవరం సత్యదేవుడి ఆలయంలో కార్తీకపౌర్ణమికి గిరిప్రదక్షిణ భక్తులతో 2లక్షల మంది విచ్చేస్తుంటారు. ఆలయ ఆచార సంప్రదాయాలు కొనసాగించేందుకు ఉదయం 8 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లు పల్లకిలో సత్య రత్నగిరి చుట్టూ తిరుగుతారు. మధ్యాహ్నానికి రత్నగిరి కొండ వ్రతాలు చేసుకునే భక్తులు తిరుగు ప్రయాణంతో కొంత ఖాళీ అవుతుంది. ఆ సమయంలో గిరిప్రదక్షిణ భక్తుల చేరికతో వారి ఇబ్బందులు తొలగుతాయి. దేవస్థానం తరపున ఏర్పాట్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతాయి. భక్తుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం.



ఒకవైపు కొట్టుకుపోయిన కాజ్‌వే

కాజ్‌వేఏదీ

- ప్రమాదకరంగా ప్రయాణం
- 20 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

రాజవొమ్మంగి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిమెట్ల కాలనీ-నెల్లిమెట్ల గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో ఉన్న కాజ్‌వే గతంలో వరద ఉధృతికి కొట్టుకు పోయింది. దీంతో సుమారు 20 గ్రామాల ప్రజలు ప్రమాదకర రీతిలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు అధికంగా కాజ్‌వే వద్దకు రావడంతో ఒకవైపు కొట్టుకుపోయి పక్కన చిన్న దారే మిగిలివుంది. సుమారు 20 గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ప్రమాదభరితంగా ప్రయాణాలు చేయడంతో నిత్యం పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణ సామగ్రి తెచ్చేందుకు భారీ వాహనాలు ఈ దారిలో వెళ్లేందుకు అవకాశం లేదు. దీంతో మినీ వ్యాన్‌లకు అధిక మొత్తంలో సొమ్ములు చెల్లించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. కాజ్‌వే కొట్టుకుపోవడంతో ఏలేశ్వరం-తాళ్లపాలెం సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. వరదల సమయంలో ప్రమాదాలు జరగకుండా చూసేందుకు మాత్రమే అధికారులు కాజ్‌వేకు ఇరువైపులా పహారా ఉంటున్నారు. వరదల అనంతరం ఏ ప్రమాదం జరిగిన వారికి పట్టదా అని దండకారణ్య విమోచన సమితి సౌత్ రీజియన్ ప్రెసిడెంట్, రంపచోడవరం ఆదివాసి జేఏసీ చైర్మన్ వంతు బాలకృష్ణ ప్రశ్నించారు. అత్యవసర సమయంలో మండల కేంద్రమైన రాజవొమ్మంగి వచ్చేందుకు కూడా ప్రమాదకరంగా ప్రయాణాలు చేయల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి కాజ్‌వేకి తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని, పాలకులు శాశ్వత పరిష్కారం చూపాలని బాలకృష్ణ డిమాండ్ చేశారు.

కోట సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలోనున్న కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి పూజలు జరిపారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూప హారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుం కుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొత్తం రూ.90,464 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

శరవేగంగా 'సాగరమాల'!


సామర్లకోటలో చకచకగా జాతీయ రహదారి పనులు

10 కిలోమీటర్ల పొడవున హైవే ఫోర్‌లైన్లు విస్తరణ

సామర్లకోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-కాకినాడ మధ్య 'సాగరమాల' ప్రాజెక్టులో భాగంగా జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సామర్లకోట ఏడీబీ రోడ్డు రాక్ సిరామిక్ సమీపం నుంచి ఎఫ్‌సీఐ గోదాముల వెనుక నుంచి చక్కెర కర్మాగార యార్డు, భీమేశ్వరాలయం వెనక నుంచి ఉండూరు సమీపాన తిరిగి ఏడీబీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ పనులు చకచకా నిర్వహిస్తున్నారు. చక్కెర కర్మాగార యార్డు నుంచి గోదావరి కాలువపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెన పనుల్లో భాగంగా ఆర్‌సీసీ గడ్డర్లను వంతెన స్తంభాలపై చేర్చే అతిక్లిష్టమైన పనులను ఆదివారం నిర్వహించారు. కెనాల్ రోడ్డులో కొన్ని గంటలపాటు వాహనాల రాకపోకలను నిలిపివేసి వంతెనకు ఇరువైపులా ఒక్కొక్కటీ 150 టన్నుల సామర్థ్యంతో రెండు భారీ క్రేన్‌లతో ఆర్‌సీసీ గడ్డర్లను ఏర్పాటు చేశారు. రూ.230కోట్లతో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తు న్నారు. 10కిలోమీటర్ల పొడవుగల ఈ జాతీయ రహదారి ఫోర్‌లైన్లు రోడ్డుగా విస్తరించనుంది. సామర్లకోట పట్టణ శివారున రైలు పట్టాలు దాటుతూ, చక్కెర కర్మాగార యార్డు మీదుగా కెనాల్‌రోడ్డు, గోదావరి కాలువలను దాటేందుకు రెండు కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. భీమేశ్వరాలయం వెనకనుంచి వ్యవసాయ పరిశోధనా కేంద్రం నుంచి ఏలేరు కాలువ, గోదావరి కాలువ, వీకే రాయపురం పంట కాలువలు కాకినాడ రైల్వేట్రాక్‌ను దాటేందుకు మరో మూడు కిలోమీటర్ల ఫ్లైఓవర్ వంతెనను నిర్మిస్తున్నారు. ఇప్పటికే వంతెనల నిర్మాణ పనులు 50శాతం పైబడి పూర్తి చేయగా అదే రీతిలో రోడ్డు నిర్మాణ పనులు సైతం నిర్వహిస్తున్నారు.



భారీ క్రేన్‌లతో ఆర్‌సీసీ గడ్డర్లను వంతెన పైకి చేరుస్తున్న దృశ్యం


పొల్లూరు జలపాతాన్ని సందర్శిస్తున్న మూర్తి

ఏజెన్సీలో ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ సుడిగాలి పర్యటన

మోతుగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ బీఎస్ఎస్ మూర్తి ఆదివారం ఏజెన్సీలో సుడిగాలి పర్యటన చేశారు. ఫారెస్ట్ ఆఫీస్‌ను సందర్శించి ఫైల్స్ తనిఖీ చేశారు. అనంతరం పొల్లూరు వాటర్ ఫాల్స్‌కి వెళ్లి అక్కడి సమస్యలను డీఎఫ్‌వో బబితను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ జలపాతాల వద్ద మరణాలను అరికట్టేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. జలపాతం వద్ద ఆఫ్ గ్రిల్స్ పనులు పూర్తి చేయాలని, అప్పటి వరకు పర్యాటకులను అనుమతించరాదన్నారు. లక్కవరం రేంజర్ నానాజీ, డీఆర్‌వో భానుప్రకాష్, ఎఫ్ఎస్‌వో మోహన్, ఎఫ్‌బీఏ వెంకటేష్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


పాపికొండలు వెళ్లేందుకు సిద్ధమైన బోట్లు

పాపికొండలుకు పోటెత్తిన పర్యాటకులు

దేవీపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం సెలవు దినం కావడంతో పాపికొండలు విహార యాత్రకు పర్యాటకులు పోటెత్తారు. ఉభయ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చారు. మండలంలోని పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాల మీదుగా సుమారు ఏడు బోట్లలో 400 మంది పాపికొండలు సందర్శనకు వెళ్లారు. పేరంటాలపల్లిలో ఉన్న శివుడిని దర్శించుకుని సందడి చేశారు.

ప్రతిభాన్వేషణ

- కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు వేళాయె
- పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- ఈ నెల 15లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- విజేతలకు నగదు బహుమతులు
- 8, 9, 10 విద్యార్థులకు మంచి అవకాశం



రాయవరం/అమలాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభతో పాటు సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిని ప్రోత్సహించేందుకు కౌశల్ సైన్స్ క్విజ్‌తో పాటు పోస్టర్-2024 పేరుతో భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) సంయుక్తంగా నిర్వహించే పోటీలకు ఇటీవల ప్రకటన విడుదలైంది. ఏపీలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మూడు దశల్లో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విజేతలైన విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రం, నగదు బహుమతులు అందజేయనున్నారు. ఆయా పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారి వివరాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. బీవీఎంఏపీ.ఆర్‌జీ వైబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నవంబరు 15 వరకు అవకాశం ఉంది.

పరీక్ష నిర్వహణ ఇలా...

పాఠశాల స్థాయిలో స్ర్కీనింగ్ పరీక్ష (ఆన్‌లైన్‌లో) నవంబరు 20, 21, 21 తేదీల్లో, జిల్లా స్థాయిలో డిసెంబరు 6న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 29, 30 తేదీల్లో నిర్వహిస్తారు.

జిల్లా స్థాయిలో ఎంపిక ఇలా: పాఠశాల స్థాయిలో జరిగే స్ర్కీనింగ్ పరీక్షలో మొదటి 20 స్థానాల్లో నిలిచిన 8, 9, 10 తరగతి విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అందులో మొదటి రెండు స్థానాలు పొందిన వారికి రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 30న విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ వద్ద నిర్వహిస్తారు.

ఏ పోటీ ఎలా:

పోస్టర్-1 (8వ తరగతి విద్యార్థులు ఇద్దరు మాత్రమే) జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు పోస్టర్ తయారుచేసి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించాలి.

టాపిక్: రీ సైక్లింగ్ ఆఫ్ వేస్ట్ మెటీరియల్ (లేదా) బయోడైవర్సిటీ అండ్ సాయిల్ హెల్త్.

పోస్టర్-2: విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ కృషి (9వ తరగతి విద్యార్థులు ఇద్దరు మాత్రమే) జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు పోస్టర్ తయారు చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించాలి.

టాపిక్: సర్ సీవీ రామన్ లైఫ్ అండ్ కాంట్రిబ్యూషన్స్ (లేదా) ఇండియన్ సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్.


రాయవరం మండలం వెదురుపాక హైస్కూల్‌లో కౌశల్ సైన్స్ పోటీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థులు

లఘు చిత్రం: 10వ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే అర్హులు. పాఠశాల, జిల్లా స్థాయిల్లో పరీక్షలకు సిలబస్ (10వ తరగతి గణితం, విజ్ఞాన శాస్త్రం, సాంఘిక శాస్త్రం (బయోగ్రఫీ అండ్ భారత్‌దర్శన్), విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి.

రాష్ట్ర స్థాయి పోటీల్లో: రెండు నిమిషాల వైజ్ఞానిక లఘు చిత్రాన్ని రూపొందించాలి. సులభ సూత్రాలను ఉపయోగించి రూట్2 విలువ కనుగొనుట (లేదా) ప్రాచీన భారతీయ శాస్త్రవేత్తల పరిశోధనల (17వ శతాబ్దానికి పూర్వం)పై రీల్స్ తయారు చేయాల్సి ఉంటుంది.

విజేతలకు నగదు బహుమతులు

జిల్లా స్థాయిలో విజేతలకు రూ.4,500 ప్రథమ, రూ.3వేలు ద్వితీయ బహుమతులుగా అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ విజేతకు రూ.15వేలు, ద్వితీయ విజేతకు రూ.12వేలు, తృతీయ విజేతకు రూ.9వేలు, రూ.6వేలు చొప్పున ముగ్గురికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో జిల్లా స్థాయి విజేతలకు రూ.1500, రూ.వెయ్యి, రాష్ట్ర స్థాయిలో రూ.5వేలు ప్రథమ, రూ.5వేలు ద్వితీయ, రూ.2వేలు తృతీయ బహుమతులతో పాటు రూ.1,500 చొప్పున ముగ్గురికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు. వైజ్ఞానిక లఘు చిత్రాలు రూపొందించిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో రూ.1,500, రూ.వెయ్యి, రాష్ట్ర స్థాయిలో రూ.5వేలు ప్రథమ,రూ.3వేలు ద్వితీయ, రూ.2వేలు తృతీయ బహుమతులతో పాటు రూ.1.500 చొప్పున ముగ్గురికి కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విజేతలకు గవర్నర్ బహుమతులు అందజేస్తారు.

జిల్లా స్థాయి వరకు ఆన్‌లైన్‌లోనే పరీక్షలు

టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, కౌశల్ రాష్ట్ర అకడమిక్ కో-ఆర్డినేటర్, అమలాపురం



పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కౌశల్-2024 పోటీలు ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలి. మరిన్ని వివరాలకు 8142035942, 9491943814 నెంబర్లను సంప్రదించాలి.

మేధస్సును వెలికితీసేందుకే...

వై.సూర్యనారాయణ, ఎంఈవో-2, రాయవరం



విద్యార్థుల మేధస్సును, సామర్థ్యాలను వెలికి తీసేందుకు కౌశల్ పోటీలు ఉపయోగపడతాయి. ఇందులో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించాం.

సద్వినియోగం చేసుకోవాలి

సాయన్న, పీఎస్ టీచర్, రాయవరం హైస్కూలు



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కౌశల్ పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయి. ఈ ఏడాది జరిగే పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.


సత్యదేవుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

నమో సత్యదేవా

- రత్నగిరికి పోటెత్తిన భక్తులు
- ఒక్కరోజు ఆదాయం రూ.70 లక్షలు

అన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో కార్తీక మాస రద్దీ క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తగా వివిధ విభాగాల ద్వారా ఒక్కరోజు సుమారు రూ.70లక్షలు ఆదాయం లభించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలను ప్రారంభించారు. ఉదయం అంతరాలయ దర్శనాలు నిలుపుదల చేసి శీఘ్ర దర్శనానికి అనుమతించారు. 6,352 జంటలు సత్యదేవుని వ్రతమాచరించాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో రామచంద్రమోహన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి రెండుగంటల సమయం భక్తులు వేచియుండాల్సి వచ్చింది.

ప్రతిఏటా కార్తీక పౌర్ణమి సాయంత్రం నిర్వహించే పంపా హారతులను నదిపై చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటివరకు పంపా హారతులను తీరం ఒడ్డు నుంచి ఇచ్చారు. ఇకపై రిజర్వాయర్లో నదీమతల్లికి స్వామివారి తెప్పోత్సవానికి వినియోగించే పంటుపై అర్చకస్వాములు హారతి ఇచ్చేలా మార్పులు చేశారు. సుమారు రెండు గంటల పాటు ఈ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరగనుంది. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, వైదిక కమిటీ సభ్యులు చామర్తి కన్నబాబు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ పరిశీలించారు.

రత్నగిరికి ఇంటెలిజెన్స్ డీజీ ప్రకాష్ కుటుంబసభ్యులతో విచ్చేశారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం వారికి వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



హారతి ఇచ్చే పంటును పరిశీలిస్తున్న వైదిక కమిటీ సభ్యులు, అధికారులు, ఇంటెలిజెన్స్ డీజీకి వేదాశీర్వచనం ఇస్తున్న పండితులు



గంజాయి తరలిస్తున్న కారు, పట్టుకున్న వ్యక్తిని చెట్టుకు కట్టేసిన ఎటపాక గ్రామస్తులు

సినీ ఫక్కీలో...

- కారులో గంజాయితో పరారీకి యత్నం
- తప్పించుకునే యత్నంలో ఎటపాకలో వీధిలో మేకల గుంపుని ఢీకొట్టిన కారు
- అనుమానాస్పదంగా ఉండడంతో వెంబడించి పట్టుకున్న ఎటపాక గ్రామస్తులు
- నిందితుడిని పట్టుకుని చెట్టుకు కట్టేసిన వైనం
- 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎటపాక పోలీసులు

ఎటపాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయి తరలిస్తూ వాహన తనిఖీల్లో పోలీసులను తప్పించుకునే యత్నంలో పరారవుతుండగా గ్రామస్తులు వెంబడించడంతో ఎట్టకేలకు దొరికిపోయాడు నిందితుడు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బొజ్జిగుప్ప నుంచి ఎటపాక మీదుగా భద్రాచలం వైపు వస్తున్న కారును పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. కారును ఆపకుండా వేగంగా వెళ్లిపోవడంతో పోలీసులు అనుమానంతో వెంబడించారు. దాంతో గంజాయి స్మగ్లర్లు తప్పించుకునే యత్నంలో కారును ఎటపాకలోని గొల్ల బజారు వీధిలోకి తిప్పారు. ఆ సమయంలో రహదారిపై మేకల గుంపును, ఆ తర్వాత పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. మేకల కాళ్లు విరగడంతో కాపరి కారుపై రాళ్లు విసిరాడు. అనంతరం కేకలు వేయడం, కారు అనుమానాస్పదంగా ఉండడంతో గ్రామస్తులు ఆ కారు వెంటపడ్డారు. ఎటపాక నుంచి మేడువాయి మార్గంలో వెళ్లే ప్రయత్నం చేసి చివరకు రహదారి సౌకర్యం లేక కారు ఆగిపోవడంతో గ్రామస్తులు పట్టుకున్నారు. ఇద్దరిలో ఒకరు పరారు కాగా మరొక వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని చెట్టుకు కట్టేశారు. దాంతో పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని, నిందితుడితో పాటు కారుని స్వాధీనం చేసుకున్నారు. అందులో 100 కిలోల గంజాయి మూటల్లో వున్నట్టు సమాచారం. కాగా పారిపోయిన నిందితుడిని కూడా తర్వాత పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. గంజాయి రవాణాలో సూత్రధారుల పాత్రపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.


వ్యాన్, గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్న వ్యక్తులతో మోతుగూడెం పోలీసులు

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

మోతుగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు వచ్చిన సమాచారంతో వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయి దొరికింది. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి పెద్దపాకలు గ్రామం నుంచి మహారాష్ట్ర తరలిస్తున్న నాసిక్‌కు చెందిన శుభం దాల్వి, రోహన్‌లను మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద 160 కిలోల గంజాయితో పట్టుకున్నారు. దాని విలువ రూ.8 లక్షలు ఉంటుంది. నిందితుల వద్ద నుంచి ఒక ఐషర్‌వ్యాన్, రెండు మొబైళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, హెచ్‌సీ పురుషోత్తం, పీసీ ఈశ్వరరావు, ఏఆర్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు దారి మళ్లింపు

సామర్లకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు-వట్లూరు ట్రాక్‌లో ట్రాఫిక్ నిర్వహణ పనులు జరుగుతున్న సందర్భంగా విజయవాడ, విశాఖపట్నం మార్గాల్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్టు విజయవాడ రైల్వే పీఆర్వో నస్రత్ ఎం.మండ్రూప్‌కర్ ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్నతాధికారి అందించిన సమాచారం ప్రకారం దారి మళ్లించిన రైళ్లు ఇవే...

ధనబాద్-అలప్పూజ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11,12 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

విశాఖపట్నం-విజయవాడ (08567) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

హటియా-ఎర్నాకుళం (22837) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

హటియా-ఎస్ఎమ్వీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ఈనెల 12న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేత 'చిత్తూరు'


విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు సభ్యులకు ట్రోఫీ అందిజేస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులు జరిగిన 68వ అంతర్ జిల్లాల అండర్-17 బాలుర బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో చిత్తూరు జిల్లా టీమ్ విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. కృష్ణా జిల్లా టీమ్ రన్నర్‌గా నిలిచింది. 3వ స్థానంలో శ్రీకాకుళం జిల్లా టీమ్, 4వ స్థానంలో విజయనగరం జిల్లా టీమ్ నిలిచాయి. ముగింపు సభలో డీఈవో మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ ఉందని, క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు మాట్లాడారు. డీవైఈవో ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్, బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్ రాష్ట్ర పరిశీలకుడు తంబి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి స్వామి, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఏవీడీ ప్రసాదరావు, దివంగత క్రీడాకారుడు ఎంవీవీబీ నాగేశ్వరరావు సతీమణి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం పాదగయలో అపచారం

- హోమ గుండంలో రశీదులు, టిక్కెట్లు పుస్తకాలు
- విచారణకు కమిటీ నియమిస్తూ ఈవో ఆదేశాలు

పిఠాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆదివారం మరో అపచారం వెలుగులోకి వచ్చింది. హోమ గుండంలో హోమ ద్రవ్యాలకు బదులు సిబ్బంది రశీదు, టిక్కెట్ల పుస్తకాలు వేయడం కలకలం సృష్టించింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో విచారణకు కమిటీ నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు హోమాలు చేయించుకుంటారు. ఆదివారం ఇదే విధంగా పలువురు భక్తులకు హోమాలు నిర్వహించారు. అత్యంత పవిత్రంగా భావించే హోమగుండంలో పూజా ద్రవ్యాలు, హోమ ద్రవ్యాలే వేయాల్సి ఉండగా దేవస్థానానికి చెందిన రశీదు పుస్తకాలు, టిక్కెట్ బుక్స్ తెచ్చి


హోమ గుండంలో వేసిన రశీదు, టిక్కెట్ల పుస్తకాలు

వేశారు. వీటిని హోమ గుండంలో వేసి దహనం చేస్తున్న సమయంలో కొందరు భక్తులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి వైరల్‌గా మారడంతో హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకుంటే సోమవారం పాదగయ వద్ద ధర్నా నిర్వహిస్తామని భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హోమ గుండంలో టిక్కెట్ పుస్తకాలు వేసి దహనం చేసిన విషయంపై విచారణ జరిపేందుకు కమిటీని నియమిస్తూ పాదగయ ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. టిక్కెట్ పుస్తకాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి, వాటిని హోమ గుండం వద్దకు తీసుకువెళ్లి ఎవరి ఆదేశాల మేరకు దహనం చేశారు, సోషల్ మీడియాకు చేరిన విధానంపై సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి 48గంటలల్లోగా నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించారు. కమిటీలో ఆలయ సూపరింటెండెంట్ వీరభద్రరావు, జూనియర్ అసిస్టెంట్లు సత్తిరాజు, ప్రసాద్‌లను సభ్యులుగా నియమించారు. వీరి నివేదిక ఆధారంగా శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఈవో స్పష్టం చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కాకినాడ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా, కోనసీమ జిల్లాల అగ్రిగోల్డ్ బాధితుల జనరల్ బాడీ సమావేశం కాకినాడ వెంకటరత్నపురంలో ఆదివారం జరిగింది. దీనికి సంఘ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఈపి నాయుడు, తిరుపతిరావు, చంద్రశేఖర్, ఆలపాటి శ్రీనివాస్, కె.బోడకొండ చర్చించారు. అక్టోబరు 28న కూటమి ప్రభుత్వం విజయవాడలో ఇచ్చిన హామీలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి న్యాయం చేయాలని నాయకులు కోరారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

భక్తులతో పోటెత్తిన ప్రాచీన ఆలయాలు


బిక్కవోలులో లక్ష్మీగణపతిని దర్శించడానికి బారులు తీరిన భక్తులు

బిక్కవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం కావడంతో బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. గ్రామంలోని లక్ష్మీగణపతి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు దీరి స్వామిని దర్శించుకుని తమ కోర్కెలు నెరవేర్చాలని చెవిలో చెప్పుకున్నారు. అనంతరం గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్‌రాజు మనుమరాలు అద్దూరి అహర్లిక అన్నప్రాసన, నామకరణ, తులాభారం కార్యక్రమాలను గోలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, వైసీపీ నాయకులు పోతుల ప్రసాదరెడ్డి, తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ 104 ఉద్యోగుల ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 104 సర్వీస్‌లను నిర్వహిస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 104 ఎంఎంయూ ఎం ప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పూర్ణిమరాజు, ఎ.లక్ష్మణరావు, పి.చంటిబాబు, అనిల్‌కుమార్, ఎస్కే అజాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 సర్వీస్‌లను ప్రభుత్వం గతంలో మాదిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించి జీవో 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఆదివారం ఈ ధర్నా నిర్వహించినట్టు చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


కొమరిపాలెంలో కూటమి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కొమరిపాలెంలో పడాల రామారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూటమి పార్టీ కార్యాలయాన్ని ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డితో కలసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పడకేసిన అభివృద్ధిని తాము చేస్తున్నామని, ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఏడు రోడ్ల మరమ్మతులకు రూ.2.50 కోట్లు, కెనాల్ రోడ్డుకు రూ.6 కోట్లతో పనులు చేపట్టామని, ప్రాచీన ఆలయాల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయించామన్నారు. కెనాల్‌రోడ్‌ను నేషనల్ హైవే లేదా రాష్ట్ర పీపీ గ్రాంట్‌లో 4వే రోడ్‌గా మార్చడానికి కృషి చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో భూసేకరణ పేరుతో కోట్లలో అవినీతి జరిగిందని దానిపై విచారణ చేయిస్తున్నామన్నారు. తప్పు చేసిన ఎవరినీ వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఇందల వీరబాబు, డీవీఆర్, బోగాది రమణ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం పాత రూట్‌ను కొనసాగించాలి

కొవ్వూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూ నిరసన


నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ కార్మికులు

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్ఎంయూ డిపో సెక్రటరీ ఎం.శివకుమార్ మాట్లడుతూ 14 రోజుల్లో 5 సార్లు నరసాపురం రూట్ మార్పులపై డిపో మేనేజర్‌తో చర్చలు జరిపామన్నారు. గతంలో మాదిరిగా నరసాపురం రూట్‌ను కొనసాగించాలని కోరామని, అయినా డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నరసాపురం రోడ్డు మార్పులతో కిలోమీటర్లు ఎక్కువ పెంచి, 40 నిమిషాలు పెంచారు. అలా కాకుండా పాత విధానాన్ని కొనసాగించాలని డీఎంకు విన్నవించామని, ఎటువంటి స్పందన లేకపోవడంతో నిరసన తెలుపుతున్నామన్నారు. నరసాపురం రూట్ తిరిగే కార్మికులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ శతాధిక కవి సమ్మేళనం


రామ్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని నన్నయ విశ్వవిద్యాలయం శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా నిర్వహించిన 141వ జాతీయ శతాధిక్య కవి సమ్మేళనంలో పాలంగికి చెందిన విశ్రాంత అంగ్లభాష అధ్యాపకుడు కోట రామప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తాను స్వయంగా రచించిన మతం కన్నా మానత్వం గొప్పది అనే వచన కవితను సభికులకు వినిపించారు. విశ్వవిద్యాలయం ఆచార్యులు పరపట్ల సత్యనారాయణ, కళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు రామప్రసాద్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓటరు నమోదు ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం బందపురంలో ఓటరు నమోదు పోలింగ్‌బూత్‌లను ఆమె పరిశీలించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని బూత్ అధికారులకు ఆదేశించారు.

ప్రకృతిని పరిరక్షించుకోవాలి

కార్తీక వన సమారాధనలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి


దుప్పలపూడిలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పరిరక్షించుకొనే లక్ష్యంతోనే వన సమారాధనలు నిర్వహించుకుంటున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం దుప్పలపూడిలో కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి అధ్యక్షతన వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ రెడ్డి కులంలో అనేకమంది మహానుభావులు జన్మించారని, దానధర్మాలతో బాటు సమాజానికి అనేక సేవలందించారన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, చింత కుంట శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రజాసేవలో రెడ్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురికి కూపన్లు అందించి డ్రా నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రముఖులను సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సత్తి సూర్యనారాయణరెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి బులిరెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆంధ్ర కేసరి కళాశాలలో దుర్వాసన సత్యనారాయణ ఆధ్వర్యంలో నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వన సమారాధనలో అధిక సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొన్నారు. సామూహికంగా భోజనం చేయడం జాతి సమైక్యతను తెలియజేస్తుందన్నారు. గైనకాలజిస్టు కె.లలితను సత్కరించారు. కార్యక్రమంలో కామేష్, హరిబాబు, మాదిరా శ్రీనివాస్, లక్ష్మీప్రసన్న, ప్రసాద్, కాత్యాయని పాల్గొన్నారు. అలాగే దిజాంపేట దేవాంగ సంఘం ఆధ్వర్యంలో తోకాడలో కాలెపు గణేష్‌రాం, లలిత వారి తోటలో వన సమారాధన జరిగింది. పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించారు. తోట యజమానులను సత్కరించారు. సంఘ సభ్యులు నల్లా శంకరరావు, పూర్ణిమ ప్రసాద్, కొడమటి జగన్మోహనరావు, ఆకాశపు సాంబశివరావు, కేవీ అప్పారావు, నల్లా శివశంకర్ పాల్గొన్నారు. ఆధ్వర్యంలో జరిగింది.


రాజమహేంద్రవరం కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణులు

ప్రజాదర్బార్ సమస్యలు

పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలన్నింటికి పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజాదర్బర్‌లో ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలపై వినతులు వచ్చాయన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వం పేదలకు మొండిచేయి చూపించిందన్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

సీతానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురంలో పేకాడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. రఘుదేవపురం చెరువుగట్టు సమీపంలోని ఇంటిపై దాడి చేసి పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,340, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఓటే వజ్రాయుధం

తహశీల్దార్ విద్యాపతి

గోపాలపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని తహశీల్దార్ విద్యాపతి అన్నారు. ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం రెండోరోజు ఆయన చిట్యాల 46,47 బూత్‌లను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 51 బూత్‌లు ఉన్నాయన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమానికి పురుషుల నుంచి 154, మహిళల నుంచి 94 మొత్తం 258 మంది ఓట్లు నమోదు చేసుకున్నారని అన్నారు. అర్హత కలిగి ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని భారతీయ పౌరుడిగా గుర్తింపు పొందాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ రాజు, వీఆర్వో కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

నల్లజర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపల్లిలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆదివారం రాత్రి నుంచి గ్రామంలో 10 మందిని పిచ్చికుక్క కరవడంతో నల్లజర్ల పీహెచ్‌సీలో నలుగురు, తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు.

సీపీ బ్రౌన్‌కి రుణపడిన తెలుగు జాతి

జయంతి కార్యక్రమంలో పలువురు ప్రముఖులు


సీపీ బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీ బ్రౌన్‌కు తెలుగు జాతి రుణపడి ఉంటుందని విశాఖపట్నం ఆలిండియా రేడియో కేంద్రం సీనియర్ అనౌన్సర్ ప్రముఖ కవి డాక్టర్ బండి సత్యనారాయణ అన్నారు. సీపీ బ్రౌన్ 226వ జయంతి సభ రాజమహేంద్రవరం సీపీ బ్రౌన్ మందిరంలో ఆదివారం నిర్వాహకుడు సన్నిదానం నరసింహశర్మ అధ్యక్షతన జరిగింది.సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనేక చారిత్రక కావ్యాలు వెలికితీయడంతో నేటి తరానికి సీపీ బ్రౌన్ నిత్యస్మరణీయులన్నారు. అంగ్లేయుల్లో ఆంధ్రబాషోద్ధారకుడిగా సీపీ బ్రౌన్‌ను అభివర్ణించారు. సన్నిదానం శర్మ మాట్లాడుతూ బ్రౌన్ వల్ల ప్రాచీన తెలుగు సాహిత్యం పరిష్కారానికి నోచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన ఆధ్యాత్మికవేత్త దీక్షితులు షణ్ముఖ శివానంద్, ప్రముఖ కవి గూటం స్వామి, మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, ప్రముఖ న్యాయవాది కెవెల్ భవాని, రియల్టర్ ఎం.లక్ష్మీకాంత్, గరికిపాటి సత్యస్వరూప్, తణుకు గోపాలకృష్ణ, బాబీ, ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

కళాగౌతమి కవి సమ్మేళనం


నాటక సమాజ ప్రాంగణంలో సమావేశమైన రచయితలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యానికి బ్రౌన్ చేసిన కృషి తిరుగులేనిదని సాహితీ విమర్శకులు వీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. కళాగౌతమి, తెలుగు సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరి వీరేశలింగం నాటక సమాజం ప్రాంగణంలో కార్తీక దీప శోభపై రచయితల సమావేశం నిర్వహించారు. తెలుగు సాహిత్యంలో ప్రతి గ్రంథాన్ని చదవగలుగుతున్నామంటే అది బ్రౌన్ పుణ్యమేనన్నారు. కళాగౌతమి చెర్ల సీతారామనాయుడు మాట్లాడుతూ తెలుగు విశిష్టతను సాహిత్యం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పినవారిలో బ్రౌన్ మొదటివారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ఎం.ఓబులేసు,పి.నరసింహమూర్తి, ధర్మేష్, కార్తీక దీప శోభ కవితలను ఆలపించారు. జి.వినయ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంజీవరావు, బీహెచ్‌రమాదేవి కవుల కవితలకు ప్రశంసలు అందించారు.

రికార్డుల్లేని 18 ద్విచక్రవాహనాలు సీజ్

ధవళేశ్వరం ఐవోసీఎల్ కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ధవళేశ్వరం, నవంబరు10(ఆంధ్రజ్యోతి):ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐవోసీఎల్ కాలనీలో సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ పర్యవేక్షణలో సీఐ పి.గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో ఆదివారం ఉదయం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కొందరు అనుమానితుల వేలి ముద్రలను ఫింగర్ ప్రింట్ డివైజ్‌తో చెక్ చేసి అదుపులోకి తీసుకున్నారు. సరైన రికార్డుల్లేని 18 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను సకాలంలో పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ స్థానికులకు చెప్పారు. ఈ సెర్చ్‌లో టూటౌన్ సీఐ దుర్గారావు, కడియం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ హరిబాబు, నాగరాజు,దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో తులాభారం

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన శ్రీకాకుళపు నాగయ్య గుప్తా భార్య జయలక్ష్మికి భగవద్గీత పుస్తకాలతోను, పటికబెల్లంతోనూ ఆదివారం తులాభారం వేసి మొక్కుబడి తీర్చుకున్నారు. ముందుగా స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

డాక్టర్ రామగురెడ్డికి

సీడబ్ల్యూఎంఏ అవార్డులు


చెన్నైలో అవార్డు అందుకుంటున్న అనపర్తి ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రామగురెడ్డి

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని హోటల్ గ్రీన్ పార్కులో రెండు రోజుల పాటు జరిగిన ఐకాన్ సదస్సులో అనపర్తికి చెందిన మగర్ వ్యాధి నిపుణులు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి రెండు అవార్డులతో బాటు డిగ్రీలు అందుకున్నారు. శనివారం జరిగిన సదస్సులో ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్‌వీ అశోకన్ చేతుల మీదుగా ఫెలోషిప్ ఇన్ కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టిసిపెంటర్స్ డిగ్రీ అందుకున్నారు. అలాగే ఆదివారం జరిగిన సదస్సులో 56 దేశాల వైద్యుల నుంచి ఎంపిక చేసిన వైద్యుల్లో రామగురెడ్డికి ఫెలోషిప్ ఆఫ్ కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్ అవార్డును సీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జయలాల్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గురెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, కూటమి నాయకులు, ఐఎంఏ వైద్యులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో

అభిలాష్‌కు గోల్డ్ మెడల్


అభిలాష్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన అండర్-19 కబడ్డీ పోటీల్లో అనపర్తి కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి అభిలాష్ బంగారు పతకం సాధించినట్టు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అభిలాష్ విశేష ప్రతిభ కనబరచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అతడిని, పీడీ వీరనాగశివను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, అభినందించారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం

రిజర్వేషన్లు కల్పించాలి

దివాన్‌చెరువు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల నాగేశ్వరరావు(నాగు) కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాఉద్యోగ రిజర్వేషన్లు బీసీ జనాభా ప్రాతిపదికన 56శాతానికి పెంచాలన్నారు. పంచాయితీరాజ్ సంస్థల్లో ప్రస్తుతం 22శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని దీనిని 50 శాతానికి పెంచాలన్నారు. కులగణన చేపట్టి బీసీ జనాభాను లెక్కించాలని, దాని ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సారా తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని బొబ్బిల్లంక శివారున ద్విచక్ర వాహనంపై సారా రవాణా చేస్తున్న దేవరకొండ శ్రీనివాస్, యరసాని వెంకన్నలను అరెస్టు చేసి వారి నుంచి 30లీటర్ల సారా, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా వారికి రిమాండ్ విధించినట్టు ఆయన తెలిపారు.


బిక్కవోలు ఉన్నత పాఠశాల 2002-2003 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


ధవళేశ్వరం లూథరన్ హైస్కూల్ 1988-89 పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం/బిక్కవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం పలుచోట్ల జరిగాయి. రాజమహేంద్రవరం మునిసిపల్ హైస్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు పిడింగొయ్యిలోని రమేష్ తోటలో కలుసుకున్నారు. అలాగే ధవళేశ్వరం లూథరన్ హైస్కూల్లో 1988-89లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, బిక్కవోలు ఉన్నత పాఠశాలలో 2002-2003లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆ రోజుల్లో తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, ఉపాధ్యాయులను ఏడిపించిన సంగతులు, వారు విధించిన శిక్షలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. రోజంతా సరదాగా గడిపారు. బిక్కవోలు పూర్వ విద్యార్థులు రంగాపురంలోని పామాయిల్ తోటలోని ఉసిరి చెట్టు వద్ద సహపంక్తి భోజనాలు చేశారు. తనుకు శ్రీధర్, కానేటి అప్పలస్వామి, తాళ్ళ శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ధవళేశ్వరం విద్యార్థుల సమ్మేళనానికి కృషి చేసిన ఎల్లోజిరావు, సాంబశివరావు, పి.విజయ్‌కుమార్, గంగాధర్‌లను మిత్రులు అభినందించారు. పిడింగొయ్యిలో జరిగిన కార్యక్రమంలో వనసమారాధన ఏర్పాటు చేసుకున్నారు. కె.పున్నయ్య, వై.హరికృష్ణ, మండవిల్లి శివ, కె.గోపాలరావు, కె.సురేష్, గేదేల సత్యనారాయణ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం మునిసిపల్ హైస్కూల్ 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


బీవీఆర్ చౌదరికి గజమాల వేసి సత్కరించిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి దంపతులు

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట

ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని శెట్టిబలిజ డవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. సామాన్య కార్యకర్తగా ఉన్న తనకు పార్టీ ఎన్నో పదవులు కట్టబెట్టిందన్నారు. పార్టీ జెండా పట్టుకుని ఎన్నికష్టాలు వచ్చినా జెండాను వీడకుండా పార్టీలు మారకుండా నిలబడిన తనను గుర్తించి ఈరోజు స్టేట్ చైర్మన్ పదవి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ విషయంలో టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నింటికి ప్రాధాన్యత ఇస్తూ శెట్టిబలిజ గౌడ, శ్రీశయన,యాత సంఘీయుల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. గత ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తే తమ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందన్నారు. లాలాచెరువు సెంటర్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని, సంఘీయుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం చైర్మన్ సత్తిబాబును శెట్టిబలిజ సంఘీయులు, టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు మునిని బాబూరావు ,కడలి రామకృష్ణ,కడియాల భద్రరావు దొంగ నాగమణి, పిల్లి శ్యామ్, కడియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబును సత్కరిస్తున్న నాయకులు

పుష్కరాలపై దృష్టి పెడతా

రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి

రాజానగరం/కోరుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రుడా చైర్మన్ పదవి తనకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెట్టిన భిక్షగానే స్వీకరిస్తున్నానని రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(రుడా) చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. రుడా చైర్మన్‌గా కూటమి ప్రభుత్వం ప్రకటించిన తరువాత తొలిసారిగా ఆదివారం బీవీఆర్ స్వగ్రామమైన పెద్దాడ నుంచి కోరుకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ర్యాలీగా బయలుదేరారు.ఈ మేరకు రాజానగరంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు గజమాలలు, బాణసంచాల కాల్పులతో ఘన స్వాగతం పలికారు. తూర్పు గోనగూడెం శివాలయం,దోసకాయలపల్లి ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.అనంతరం ఆయన కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు.అక్కడ జరుగుతున్న కార్తీక అన్న సమారాధనలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.గతేడాది కాలంగా పార్టీ కార్యకలాపాల్లో తన వెంట ఉంటూ తమలో ఒకరిగా భావించి తన వెన్నంటే ఉంటున్న కూటమి నాయకులు, కార్యకర్తలు ఆదరాభిమానాలతోనే సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నాయకుడు లోకేశ్ తనకు ఈపదవి కట్టబెట్టి నట్టుగా భావిస్తున్నానన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తాన న్నారు. రుడా చైర్మన్ పదవి ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే నాగ కేశవ రావు, గంగిశెట్టి చంటిబాబు, రొంగల శ్రీనివాస్, మార్ని రాము, మార్ని వీరాంజనేయులు, ధారా రాంబాబు, దోసకాయలపల్లి సర్పంచ్ ధారా యశోదమ్మ, కటకం చలం తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గంగిశెట్టి చంటి బాబు, కంటె కేశవరావు, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, తెలుగు యు వత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు, నాయకులు నీలపాల అరవరాజు, బత్తుల త్రిమూర్తులు, నూనె వెంకన్న, మద్దిరెడ్డి చిన వెంకటేశ్వరరావు, పెద్దిశెట్టి నారాయణస్వామి, నాతిపాం జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

7


చిన్నారి సిద్ధార్థను అభినందిస్తున్న మంత్రి దుర్గేష్
మాట్లాడుతున్న స్వామిజీ

ముగిసిన భక్తసమ్మేళనం

నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస సందేశాన్ని ప్రపంచమంతా చాటుతున్నట్టుగా ముందుగానే శారదాదేవి స్వప్నంలోనే చూశారని స్వామి సేవానంద మహరాజ్ అన్నారు.నిడదవోలు లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామకృష్ణ వివేకానంద ఐదో భక్త సమ్మేళనం ముగింపోత్సవం లో ఆయన మాట్లాడారు.దేశంలో రెండు వందలకుపైగా శ్రీరామకృష్ణ మఠాలు రావడానికి శారదాదేవి ప్రార్థనే కారణమన్నారు. భక్తిశ్రద్ధలుంటే మనం సాధన చేసుకునేందుకు సమయం ఉంటుందన్నారు.

చిన్నారి సిద్ధార్థకు అభినందన

ప్రియమైన సోదరులారా భారతదేశపు నేల నా మహోన్నతస్వర్గం భారతదేశపు ప్రతి ధూళికణం నాకెంతో పవిత్రమైనది అంటూ 4వ తరగతి విద్యార్థి తుట్టగుంట సిద్ధార్థ స్వామి వివేకానంద ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. సిద్ధార్థ వివేకానంద ఏకపాత్రాభినయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు, మంత్రి కందుల దుర్గేష్ అభినందలతో ముంచెత్తారు. వివేకానందుడి బోధనలు యువత భవిష్యత్తుకు మార్గదర్శకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్వామీజీలు, మాతాజీలు,మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మందేదీ!



డిమాండ్ హై..సరఫరా లో..

- షాపుల్లో మందు కొరత
- బ్రాండ్లు అందక ఇబ్బంది
- అవసరత 5 వేల కేసులు
- దిగుమతి 2 వేల కేసులు
- రేషన్ విధానంలో పంపిణీ
- చాలా దుకాణాల్లో నిల్వలు
- వ్యాపారుల మతలబు
- మందుబాబుల అవస్థలు
- అధికారుల తనిఖీల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కొత్త మద్యం పాలసీ.. ప్రైవేటు షాపులు అందుబాటులోకి వచ్చాక మందు బాబులు పండగ చేసుకుంటున్నారు.నాణ్యమైన సరుకు గొంతులోకి దిగుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొత్త పాలసీ ప్రారంభమైన మూడు వారాలకే బ్రాండ్ల కొరత రావడంతో నొచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ పిచ్చి బ్రాండ్లకు స్వస్తి పలికిన విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే మద్యం దుకాణాలకు బ్రాండ్లు వస్తున్నాయి. రోజుకు ఎంత సరఫరా చెయ్యాలో ఇంకా ఓ అంచనాకు రాకపోవడంతో కొరత వస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ హయాంలోని రంగుసారా స్టాకు 2వేల కేసులు ఉంది. దానిని వదిలించుకొనే ఉద్దేశంతో కొరత సృష్టిస్తున్నారా? అనే అనుమానాలున్నాయి. ఏదేమైనా మందుబాబులు ఆనందపడే లోపుగానే కొరత రావడంతో ఇబ్బంది పడుతున్నారు.

రేషన్ విధానం

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విచ్చలవిడిగా నాసిరకం మద్యాన్ని ఏరులై పారించారు. దీంతో ఐదేళ్ల పాటు నాసిరకం మద్యాన్ని మందుబాబులు గొంతులో పోసుకోక తప్పలేదు. ఎన్నికల హామీలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఎంసీ, సియాగ్రమ్స్ వంటి అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్ల సరఫరా మొదలైంది. ఇప్పుడు కొత్త చిక్కు వచ్చిపడింది. వ్యాపారస్తుల ఇండెంట్ ప్రకారం ఆయా కంపెనీలు సరఫరా చేయలేకపోతున్నాయి. వైసీపీ హయాంలోని ప్రభుత్వ దుకాణాల వల్ల కేవలం వాళ్ల బ్రాండ్లనే మార్కెట్ చేశారు. ఇప్పుడు ప్రైవేటు దుకాణాలు కావడంతో వ్యాపారస్తులు తమకు ఎక్కువగా విక్రయాలు జరిగే బ్రాండ్లకు ఆర్డర్ చేస్తున్నారు. పైగా ప్రైవేటు దుకాణాలకు ఎంత కావాలంటే అంత సరఫరా చేయాల్సి ఉంటుంది. దీంతో వీళ్ల ఎక్కువ మొత్తంలో నిల్వ చేస్తున్నారు. ఈ కారణంగా కూడా కొరత ఏర్పడుతోంది. రేషన్ విధానంలో డిపోల నుంచి పంపిణీ చేస్తున్నారు.దీంతో గత ప్రభుత్వంలో సరఫరా చేయబడి నిల్వ ఉన్న బూమ్,బీరా వంటి వాటిని క్రమంగా వదిలించుకుంటున్నారు.షాపుల్లో మళ్లీ అవి కనబడుతుండడంతో మందుబాబుల్లో అసహనం కనబడుతోంది.కొత్త మద్యం పాలసీ షోకు అప్పుడే అయిపోయిందా అంటూ పెదవి విరుస్తున్నారు.

ఆదివారం టెన్షన్

వైసీపీ ప్రభుత్వంలో రూ.150 వెచ్చించినా నాసిరకమైన రంగు సారా తాగాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రూ.99కే నాణ్యమైన చీప్ లిక్కర్ తేవడంతో దానికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. రోజుకు రెండు మూడు లోడ్లు వచ్చినా సరిపడని పరిస్థితి ఉంది. ఇప్పుడు రోజుకు ఒక లారీ మాత్రమే వస్తోంది. లారీ సైజును బట్టి 1000 నుంచి 1600 కేసులు వస్తున్నాయి. దీంతో పంపిణీపై అధికారులు తల పట్టుకుంటున్నారు.రాజమహేంద్రవరం ఏపీఎస్‌బీసీఎల్ డిపో పరిధిలో మద్యం దుకాణాలు, బార్లు కలిపి 150 వరకూ ఉన్నాయి. లారీ లోడు వచ్చిన వెంటనే దుకాణానికి సరాసరిన 8 కేసుల లెక్కన ఇస్తుంటే ఉఫ్‌మని అయిపోతున్నాయి. మళ్లీ లోడు వచ్చే వరకూ ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది.ఎంసీ, ఐబీ, నాకవుట్, కేఎఫ్ వంటి ఎక్కువగా విక్రయాలు జరిగే ఓ ఏడెనిమిది బ్రాండ్ల సరఫరా కూడా తగ్గింది. రోజుకు 5 వేల కేసుల అవసరత ఉంటే 2 వేల కేసుల వరకూ మాత్రమే వస్తున్నాయి. ఆదివారం డిపోలకు సెలవు కావడంతో దుకాణదారులు శని, ఆదివారాలకు కలిపి శనివారం కొనుగోలు చేస్తారు. దీంతో శనివారం పంపకాలు చేయడానికి అధికారులకు ఇబ్బంది తప్పలేదు. ఆదివారం అమ్మకాలు ఎక్కువగా ఉండడంతో వ్యాపారస్తులు అందరూ ఆ రోజుపై ఫోకస్ చేస్తుంటారు. ప్రస్తుతానికి రాజమహేంద్రవరం డిపో నుంచి రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకూ సరుకు వెళుతోంది. అయితే దీనిలో చాలా మటుకు వ్యాపారస్తులు నిల్వ చేస్తున్నారు.అటు సరఫరా తగ్గడం, ఇటు వ్యాపారస్తులు ఇబ్బడిముబ్బడిగా సరుకు నిల్వ చేసుకోవడంతో.. జనాదరణ కలిగిన బ్రాండ్లు కొన్ని షాపుల్లోనే అందుబాటులో ఉంటే అనధికారికంగా ధర పెంచేస్తారని మందు బాబులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా చేస్తున్నట్టు సమాచారం.

డీఎస్సీ ఎప్పుడో!



- డీఎస్సీ నోటిఫికేషన్‌కు జాప్యం..
- నిరాశలో నిరుద్యోగులు
- 4న విడుదలైన టెట్ ఫలితాలు..
- 6న డీఎస్సీ ప్రకటన వస్తుందని ఆశ
- అమల్లోకి ఎమ్మెల్సీ కోడ్..
- సాంకేతిక కారణాలతో ఆలస్యం
- ఉమ్మడి జిల్లాలో 1346 ఖాళీలు
- తప్పని ఎదురుచూపులు

కాకినాడ రూరల్,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది. ఆ ఐదేళ్లూ అభ్యర్థులకు ఎదురుచూపులే మిగిలాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది.రాష్ట్రవ్యాప్తంగా 16,347కుపైగా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించింది. ఈ ఫలితాలు 4న విడుదల కావడంతో 6న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని భావించారు. ఇప్పటికే చాలా మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకుంటూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుతో పాటు అభ్యర్థుల వయస్సు పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున కొన్ని అనివార్య కారణాలతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన వాయిదా పడింది. కానీ ఆ సమస్యలన్నింటినీ సరిచేసి కోడ్ ముగిసిన తర్వాత మరికొద్దిరోజుల్లో నోటిఫికేషన్ వెలువరిస్తారని అధికారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో తమకు మళ్లీ ఎదురుచూపులు తప్పడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1346 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 94, తెలుగు 78, హిందీ 77, గణితం 60, ఫిజికల్ సైన్స్ 69, బయాలాజికల్ సైన్స్ 99, సోషల్ స్టడీస్ 130, ఫిజికల్ ఎడ్యుకేషన్ 201, ఎస్జీటీలు 365, పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు అన్నీ కలిపి డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నట్టు తెలిసింది.వారం రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.నోటిఫికేషన్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 90 వేల మంది కిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఓం నమో శివ రుద్రాయ

6

పంచారామాల ప్రత్యేకం



మామూళ్లు.. మామూలే!

- ఆగని ఇసుక దోపిడీ
- దళారుల ఇష్టారాజ్యం
- తీపర్రులో అదనపు వసూళ్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు.. తనిఖీ
- నోరుమెదపని వాహనదారులు


పెరవలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇసుక దోపిడీ కొనసాగుతూనే ఉంది.. ప్రత్యక్షంగా పరోక్షంగా భవన యజమానుల నుంచి దోపిడీకి పాల్పడుతున్నారు. అయినా అడ్డుకట్ట వేసేవారే కానరావడంలేదు. కలెక్టర్ ఎన్ని హెచ్చరికలు చేసినా రీచ్‌ల వద్ద మామూళ్ల మామూలుగానే సాగుతున్నాయి..ఇప్పటికీ మీకెంత.. మాకెంత అన్నట్టుగా ఇసుక రవాణా సాగుతున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇసుకపై రూపాయి వద్దన్నా.. దళారీలు మాత్రం వదలడంలేదు. ఏదో ఒక విధంగా దోపిడీకి తెగబడుతూనే ఉన్నారు. శనివారం కలెక్టర్ ప్రశాంతికి ఎదురైన సంఘటనే అందుకు ఉదాహరణ. తీపర్రు ఇసుక ర్యాంప్‌లో లారీల వద్ద నుంచి వసూలు చేయాల్సిన దానికంటే ఎక్కువ వసూలు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు అందింది. దీంతో శనివారం ఆమె హుటాహుటిన తీపర్రు ర్యాంప్‌కు వచ్చారు. అయితే అక్కడ ర్యాంప్‌లో వాహనదారులు ఆమె వద్దకు వెళ్లి తమ వద్ద ఎక్కువ వసూలు చేసినట్టు చెప్పకపోవడం విశేషం. దీంతో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదు అందిందని చెప్పగా నిర్ణయించిన ధర మాత్రమే వసూలు చేస్తున్నామని సమాధానం ఇచ్చారు.దీంతో నిర్ణయించిన ధరకంటే ఎక్కువ సొమ్ము వసూలు చేస్తేచర్యలుతప్పవని హెచ్చరించి వెళ్లిపోయారు.

తీపర్రులో అదనంగా వసూళ్లు?

పెరవలి మండలం తీపర్రు ర్యాంపునకు పాలకొల్లు, భీమవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన లారీల నుంచి ఒక్కొక్క లారీకి రూ.2 వేలు చొప్పున వసూలు చేయాల్సి ఉండగా రూ.5 వేల నుంచి రూ.6 వేలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.గోదావరిలో ఇసుకను కూలీలతో ఎగుమతి చేయించి ట్రాక్టర్లపై తెచ్చి దిగుమతి చేయించి జేసీబీలతో లారీలపై ఎగుమతి చేస్తున్నారు.దీంతో కాంట్రాక్టరుకు గిట్టుబాటు కావడం లేదు.ఈ నేపథ్యంలో కొంత ఎక్కువ వసూలు చేయాల్సి వస్తుందని కొంత మంది చెబుతున్నారు.అయినప్పటికి నిర్ణయించిన ధర ప్రకారం వసూలు చేయాలని అదనంగా వసూలు చేస్తే సహించేది లేదని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు.ఈ మేరకు తహశీల్దార్ అచ్యుత కుమారి శనివారం సాయంత్రం వరకు అక్కడే ఉండి లారీలు వద్ద అదనపు సొమ్ము వసూలు చేయకుండా నిర్ణయించిన ధర మాత్ర మే వసూలు చేసి ఎగుమతి అయ్యేలా చూశారు.



10 టన్నులు..రూ.960.20



ఒక టన్ను ఇసుకకు రూ.96.2, 4 టన్నులకు రూ.384.8 పైసలు, పది టన్నులకు రూ.960.20 పైసలు, 20 టన్నులకు 19.25పైసలు వసూలు చేయాలని బోర్డు ఏర్పాటు చేశారు. అదనం గా డబ్బులు వసూలు చేస్తే తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ర్యాంప్‌లో అం దరికీ కనపడే విధంగా బ్యానర్లు పెట్టారు. దీంతో లారీ యజమానులు, డ్రైవర్లు ఆనందంవ్యక్తం చేస్తున్నారు.ఆదివారం ప్రభుత్వ సిబ్బందికి సెలవు కావడంతో ఎగుమతి కాలేదు.సోమవారం లారీల నుంచి ఏ విధంగా సొమ్ములు వసూలు చేస్తారనేది చూడాలి.

ఇసుక అక్రమాలకు పాల్పడితే నాకు ఫిర్యాదు చేయండి : మంత్రి



నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు జరగాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొందరు అత్యాశపరులు ఉచిత ఇసుక పథకాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ఇసుక విక్రయాలు సాగిం చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగానే ఉచిత ఇసుక పథకం అమలు జరిగి తీరాలన్నారు. అత్యాశపరులు ఎవరైనా ఇసుక విక్రయాల్లో ఎవరి పేరు ఉపయోగించినా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుకకు ధర లేదని.. రవాణాకు మాత్రమే చెల్లించాలన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పోలీసు రెవెన్యూ అధికార్ల దృష్టికి తీసుకెళ్లాలని..లేదా నాకు ఫిర్యాదు చేసినా స్పందిస్తానన్నారు.

ఇసుక కొరత రానీయవద్దు : జేసీ

రాజమహేంద్రవరం,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):బోట్స్‌మన్ సొసైటీల సభ్యులంతా ఇసుక కొరత రాకుండా చూసుకోవాలని జేసీ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం 90 బోట్స్‌మన్ సొసైటీల సభ్యులతో ఇసుక సరఫరాపై సమీక్షించారు. నిర్మాణ పనులకు అంతరాయంలేకుండా ఇసుకను అందించాలన్నారు.బోట్స్‌మన్ సొసైటీలకు చెల్లించాల్సిన ఇసుకతీత డబ్బు ఆయా సొసైటీ బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తామన్నారు. ప్రతి రీచ్‌లో రోజుకు 1000 నుంచి 2000 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లడానికి ఓపెన్ రీచ్‌లలో ఉచిత ఇసుక సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.ప్రభుత్వానికి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు.సమావేశంలో జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్‌రెడ్డి,ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత పాల్గొన్నారు.


నగరపాలక సంస్థలో ట్రైనీ ఐఏఎస్‌లకు వివరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్


జీజీహెచ్‌లో ఓపీ తీరు తెలుసుకుంటున్న ట్రైనీ ఐఏఎస్‌లు

ట్రైనీ ఐఏఎస్‌ల పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫీల్డ్‌స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం (ఎఫ్ఎస్ఆర్‌పీ) 99వ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు 11 మంది ఆదివారం రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగులకు, గర్భిణులు తదితరులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ల్యాబ్‌ను సందర్శించి అక్కడ నిర్వహించే పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. ఫార్మసీలో మందుల స్టాకు వివరాలు, గడువు దాటిన మందుల విషయంలో తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న అర్బన్ హెల్త్ సెంటర్లలో అందిస్తున్న వైద్యసేవల గురించి ట్రైనీ ఐఏఎస్‌లకు వివరించారు. ముందుగా, ఓపీ వివరాల నమోదు చేసి వాటిని ఆన్‌లైన్‌లో ఉంచుతామని, అనంతరం అవసరమైన వైద్యసేవలందిస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌ను సందర్శించారు. నగరపాలక సంస్థ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై కమిషనర్ కేతన్ గార్గ్ అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. ఈట్ రైట్ క్యాంపైన్ ద్వారా చేపట్టిన ఆహార విక్రయకేంద్రాల తనిఖీలు, శానిటేషన్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల వివరాలు, నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను ఈ బృందం సందర్శించారు. అనంతరం ఇన్నీసుపేటలోని పీహెచ్‌సీని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ హరిబాబు, డాక్టర్ షమ్మీకుమార్, ఎపిడమాలజిస్ట్ సుధీర్, అర్బన్ హెల్త్ విజిటర్ విజయకుమారి,డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ కోటయ్య పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నరసాపురం పాత రూట్‌ను కొనసాగించాలి

కొవ్వూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ నిరసన



నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ కార్మికులు

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్‌ఎంయూ) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్‌ఎంయూ డిపో సెక్రటరీ ఎం.శివకుమార్ మాట్లడుతూ 14 రోజుల్లో 5 సార్లు నరసాపురం రూట్ మార్పులపై డిపో మేనేజర్‌తో చర్చలు జరిపామన్నారు. గతంలో మాదిరిగా నరసాపురం రూట్‌ను కొనసాగించాలని కోరామని, అయినా డిపో మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నరసాపురం రోడ్డు మార్పులతో కిలోమీటర్లు ఎక్కువ పెంచి, 40 నిమిషాలు పెంచారు. అలా కాకుండా పాత విధానాన్ని కొనసాగించాలని డీఎంకు విన్నవించామని, ఎటువంటి స్పందన లేకపోవడంతో నిరసన తెలుపుతున్నామన్నారు. నరసాపురం రూట్ తిరిగే కార్మికులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ శతాధిక కవి సమ్మేళనం



రామ్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని నన్నయ విశ్వవిద్యాలయం శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా నిర్వహించిన 141వ జాతీయ శతాధిక్య కవి సమ్మేళనంలో పాలంగికి చెందిన విశ్రాంత ఆంగ్లభాష అధ్యాపకుడు కోట రామప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తాను స్వయంగా రచించిన మతం కన్నా మానత్వం గొప్పది అనే వచన కవితను సభికులకు వినిపించారు. విశ్వవిద్యాలయం ఆచార్యులు పరపట్ల సత్యనారాయణ, కళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు రామప్రసాద్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

న్యాయం చేయాలంటూ 104 ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 104 సర్వీస్‌లను నిర్వహిస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 104 ఎంఎంయూ ఎం ప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పూర్ణిమరాజు, ఎ.లక్ష్మణరావు, పి.చంటిబాబు, అనిల్‌కుమార్, ఎస్‌కే అజాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 సర్వీస్‌లను ప్రభుత్వం గతంలో మాదిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించి జీవో 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఆదివారం ఈ ధర్నా నిర్వహించినట్లు చెప్పారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి వృద్ధాశ్రమంలో దుస్తులు, దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని పల్లంట్లలో మానవత రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుడు మెహర్‌శ్రీరామకృష్ణ మహంత్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేశారు. పల్లంట్లకు చెందిన పెదపాటి వెంకటరత్నం కిడ్నీవ్యాధితో బాధపడుతండడంతో వైద్య ఖర్చులకు బలుసు సత్యనారాయణ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కల్పించాలి

దివాన్‌చెరువు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల నాగేశ్వరరావు(నాగు) కోరారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత చిత్తూరు

» క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు : ముగింపు సభలో డీఈవో వాసుదేవరావు

» ప్రేక్షకులు లేక వెలవెలబోయిన క్రీడా పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఈవో



మ్యాచ్‌లు తిలకిస్తున్న క్రీడాకారులు, నిర్వాహకులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రెండు రోజులపాటు జరిగిన 68వ అంతర్‌జిల్లాల అండర్-17 బాలుర బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో చిత్తూరు జిల్లా టీమ్ విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. కృష్ణా జిల్లా టీమ్ రన్నర్‌గా నిలిచింది. 3వ స్థానంలో శ్రీకాకుళం జిల్లా టీమ్, 4వ స్థానంలో విజయనగరం జిల్లా టీమ్ నిలిచాయి. ముగింపు సభలో డీఈవో మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ ఉందని, క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. సీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు మాట్లాడారు. డివిజన్ డీవైఈవో ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజి డీఐ దిలీప్‌కుమార్, రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్ పరిశీలకుడు తంబి, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి స్వామి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏవీడీ ప్రసాదరావు, దివంగత క్రీడాకారుడు ఎంవీవీబీ నాగేశ్వరరావు సతీమణి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు, నిర్వాహకులే ప్రేక్షకులు..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు ప్రేక్షకులు లేకుండా పోయారు. క్రీడాకారులు కొట్టే అద్భుతమైన షాట్లకు చప్పట్లు కొట్టేవారే కరవయ్యారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆయా జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, నిర్వాహకులే ప్రేక్షకులు కావడం గమనార్హం. ఇప్పటికే బాల్‌బ్యాడ్మింటన్‌కు గడ్డుకాలం నడుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్ జిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ పోటీలకు కనీస ప్రచారం కల్పించడంలో విద్యాశాఖ అధికారులు, నిర్వాహకులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. శని, ఆదివారాలు స్కూళ్లకు సెలవులు. కనీసం ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులను, సమీపంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులను ఈ పోటీలు తిలకించేందుకు రప్పించే ప్రయత్నం చేయలేదు. ఇప్పటికే బాల్‌బ్యాడ్మింటన్ క్రీడకు ఆదరణ అంతంతమాత్రంగా ఉన్న సమయంలో నిర్వాహకులు తూతూ మంత్రంగా పోటీలు నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది.



బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పోటీపడుతున్న క్రీడాకారులు

ప్రజాదర్బార్ సమస్యలు
పరిష్కరిస్తాం
ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలన్నింటికి పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నా రు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజాదర్బార్‌లో ముఖ్యంగా పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు తది తర సమస్యలపై వినతులు వచ్చాయన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరి స్తామన్నారు. గత ప్రభుత్వం పేదలకు మొండి చేయి చూపించిందన్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందిస్తున్నారని చెప్పారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

సీతానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యో తి): మండలంలోని రఘుదేవపురంలో పేకాడుతున్న 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. రఘుదేవపురం చెరువుగట్టు సమీపంలోని ఇంటిపై దాడి చేసి పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.16,340, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అరుంధతి ఉద్యోగ, ఉపాధ్యాయ
ఫెడరేషన్ ఆర్థిక సాయం



చాగల్లు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అరుంధతి ఉద్యోగ, ఉపాధ్యాయ ఫెడరేషన్ తరుపున వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేశారు. గోపాలపురం మండలం వాదాలగుంటకు చెందిన పత్తిపాటి సత్యవతి థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్యం పొందుతున్నారు. ఆమెకు వైద్య ఖర్చుల ఆర్థిక సాయం అందజేశారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన ఏడిద మురళి, సంధ్య దంపతులు రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అరుంధతి ఉద్యోగ ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు కేవీవీ సత్యనారాయణ, బొల్లిపో మధుశేఖర్, మెరిపో జలమయ్య, చాపల రామారావు, బాబురావు, ఈఆర్పీ కొయ్యే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక కేంద్రాలు



ఓటరు నమోదు పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఓటరు నమోదు ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం మండలంలోని బందపురంలో ఓటరు నమోదు పోలింగ్ బూత్‌లను ఆమె పరిశీలించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని బూత్ అధికారులకు ఆదేశించారు.

వేంకటేశ్వరస్వామి
ఆలయంలో తులాభారం

దేవరపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో దేవరపల్లి గ్రామానికి చెందిన శ్రీకాకుళపు నాగయ్య గుప్తా భార్య జయలక్ష్మికి భగవద్గీత పుస్తకాలతోను, పటికబెల్లంతోనూ ఆదివారం తులాభారం వేసి మొక్కుబడి తీర్చుకున్నారు. ముందుగా స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు నాగయ్యగుప్తా భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళపు సాయిమణికంఠ, జాహ్నవి దంపతులు ఆలయ కమిటీచైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్, తదితరులు పాలొన్నారు

కబడ్డీలో అభిలాష్‌కు గోల్డ్‌మెడల్

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన అండర్-19 కబడ్డీ పోటీల్లో అనపర్తి కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి అభిలాష్ బంగారు పతకం సాధించినట్టు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అభిలాష్ విశేష ప్రతిభ కనబరచినట్టు చెప్పారు. ఈ సందర్భంగా అతడిని, పీడీ వీరనాగశివను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, అభినందించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

నల్లజర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపల్లిలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆదివారం రాత్రి నుంచి గ్రామంలో 10 మందిని పిచ్చికుక్క కరవడంతో నల్లజర్ల పీహెచ్‌సీలో నలుగురు, తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు
దారి మళ్లింపు

సామర్లకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీ డు-వట్లూరు ట్రాక్‌లో ట్రాఫిక్ నిర్వహణ పనులు జరుగు తున్న సందర్భంగా విజయవాడ, విశాఖపట్నం మార్గాల్లో పలు ఎక్స్ ప్రెస్ రైళ్లను దారి మళ్లించినట్టు విజయవాడ రైల్వే పీఆర్వో నస్రత్ ఎం.మండ్రూప్‌కర్ ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే ఉన్న తాధికారి అందించిన సమాచారం ప్రకారం దారి మళ్లించిన రైళ్లు ఇవే..

ధనబాద్-అలప్పూజ (13351) బొకారో ఎక్స్ ప్రెస్ ఈ నెల 11,12 తేదీల్లో నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. విశాఖపట్నం-విజయ వాడ (08567) ఎక్స్ ప్రెస్ ఈ నెల 13న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎర్నాకుళం (22837) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11న నిడదవోలు, భీమవరం, గుడి వాడ మీదుగా విజయవాడ చేరుతుంది. హటియా-ఎస్ఎమ్వీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ఈనెల 12న నిడదవోలు, భీమవరం, గుడివాడ మీదుగా విజయవాడ చేరుతుంది.

కోట సత్తెమ్మ అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి పూజలు జరిపారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూప హారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆల యం కిటకిటలాడింది. ఆదివా రం అమ్మవారికి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.15,640, అన్నదాన విరాళాల ద్వారా రూ.31,584, ప్రసాద విక్రయాల ద్వారా రూ.30,390, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.12,850 మొత్తం రూ.90,464 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్య ప్రకాష్ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



కార్తీక వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

వన సమారాధనలు ఐక్యతకు దోహదం

కొవ్వూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పూజలు, వన సమారాధనలతో మన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడతాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం వేములూరు గ్రామంలో ఆదివారం జరిగిన విఘ్నేశ్వర కార్పెంటరి వర్కర్స్ యూనియన్ కార్తీక వన సమారాధన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొనగా, నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటి సభ్యులు కంటమణి రామకృష్ణారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కవులూరులో కార్తీక అన్న సమారాధనలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

కార్తీక వన సమారాధన

నల్లజర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోతవరం-కవులూరు గ్రామాల మధ్య ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద కార్తీక వన సమారాధన జరిపారు. భక్తులతోపాటు అయ్యప్పస్వాములు ఈ సమారాధనలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.





పొగాకు బోర్డు సమీపంలో తిరగబడిన ట్రాక్టర్ ట్రక్కు. పక్క చిత్రంలో ప్రమాదంలో గాయపడిన వారి వివరాలను నమోదు చేసుకుంటున్న ఎస్‌ఐ సతీష్‌కుమార్

ట్రాక్టర్ బోల్తా...నలుగురికి గాయాలు

గోపాలపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ తిరగబడి నలుగురు గాయపడిన ఘటన పొగాకు బోర్డు సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ కే.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు ట్రాక్టర్‌పై వేలచింతలగూడెం వస్తుండగా పొగాకు బోర్డు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి లోయలో తిరబడిందన్నారు. దీంతో ట్రాక్టర్‌పై వస్తున్న ముగ్గురితో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయని ఆయన అన్నారు. గాయపడిన వ్యక్తులను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పతకాలు



పోటీల అనంతరం బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

కొవ్వూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు గోల్డ్‌మెడల్ సాధించినట్టు దొమ్మేరు హైస్కూల్ పి.డి రాజేంద్రకుమార్, చిన్నాయిగూడెం పాఠశాల పిఈటి శ్రీనివాస్‌లు తెలిపారు. కర్నూలు జిల్లా సి. బెలగాలలోని ఆంధ్రప్రదేశ్‌సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈ నెల 9,11 తేదీలలో 68వ స్కూల్ గేమ్స్ స్టేట్ సెపక్‌తక్రా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలుర జట్టు గోల్డ్‌మెడల్, బాలికల జట్టు సిల్వర్ మెడల్స్‌ను గెలుపొందాయి. ఈ పోటీలలో దొమ్మేరు హైస్కూల్ విద్యార్థులు 4గురు, దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాల, బాలికల జట్లు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

ఓటే వజ్రాయుధం



చిట్యాలలో ఓటు నమోదు పత్రాన్ని తీసుకుంటున్న తహసీల్దార్ విద్యాపతి

గోపాలపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని తహశీల్దార్ విద్యాపతి అన్నారు. ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం రెండోరోజు ఆయన చిట్యాల 46, 47 బూత్‌లను ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 51 బూత్‌లు ఉన్నాయన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమానికి పురుషుల నుంచి 154, మహిళల నుంచి 94 మొత్తం 258 మంది ఓట్లు నమోదు చేసుకున్నారని అన్నారు. అర్హత కలిగి ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని భారతీయ పౌరుడిగా గుర్తింపు పొందాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ రాజు, వీఆర్వో కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న
ఇద్దరికి రిమాండ్

సీతానగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని బొబ్బిల్లంకలో బైక్‌పై సారా రవాణా చేస్తున్న దేవరకొండ శ్రీనివాస్, యరసాని వెంకన్నలను అరెస్టు చేసి వారి నుంచి 30లీటర్ల సారా, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం/బిక్కవోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం పలుచోట్ల జరిగాయి. రాజమహేంద్రవరం మునిసిపల్ హైస్కూల్లో 1985-86లో పదో తరగతి చదివిన విద్యార్థులు పిడింగొయ్యిలోని రమేష్ తోటలో కలుసుకున్నారు. అలాగే ధవళేశ్వరం లూథరన్ హైస్కూల్లో 1988-89లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, బిక్కవోలు ఉన్నత పాఠశాలలో 2002-2003లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుకున్నారు. ఆ రోజుల్లో తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, ఉపాధ్యాయులను ఏడిపించిన సంగతులు, వారు విధించిన శిక్షలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. రోజంతా సరదాగా గడిపారు. బిక్కవోలు పూర్వ విద్యార్థులు రంగాపురంలోని పామాయిల్ తోటలోని ఉసిరి చెట్టు వద్ద సహపంక్తి భోజనాలు చేశారు. తనుకు శ్రీధర్, కానేటి అప్పలస్వామి, తాళ్ళ శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ధవళేశ్వరం విద్యార్థుల సమ్మేళనానికి కృషి చేసిన ఎల్లోజిరావు, సాంబశివరావు, పి.విజయ్‌కుమార్, గంగాధర్‌లను మిత్రులు అభినందించారు.